ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
ఏలూరు
జిల్లా వార్తలు
శనివారం 6 డిసెంబరు 2025

ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 30.0
కనిష్ఠం : 16.0

మండల, జిల్లాస్థాయి సైన్స్ ఫెయిర్ల నిర్వహణకు సన్నాహాలు

ఏలూరు అర్బన్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులతో ప్రస్తుత విద్యాసంవత్సరంలో నిర్వహించాల్సిన వైజ్ఞానిక ప్రదర్శన (సైన్స్ ఫెయిర్)లకు బాలబాలికలు సన్నద్ధం కావాలని డీఈవో వెంకటలక్ష్మమ్మ, జిల్లా సైన్స్ ఆఫీసర్ సోమయాజులు తెలిపారు. తొలిదశలో జిల్లావ్యాప్తంగా శుక్రవారం అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించిన మెగా పీటీఎం సందర్భంగా స్కూల్ లెవెల్ సైన్స్‌ఫెయిర్లు జరిగాయన్నారు. త్వరలో నిర్వహించే మండలస్థాయి సైన్స్ ఫెయిర్లకు ఒక్కో థీమ్ నుంచి ఒక ప్రాజెక్టు చొప్పున 7 గ్రూపు ప్రాజెక్టులను, 2 వ్యక్తిగత ప్రాజెక్టులు, 2 టీచరు ప్రాజెక్టులను ఎంపిక చేసి మొత్తం 11 ఉత్తమ ప్రాజెక్టులతో జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శన జరుగుతుందని, తేదీని తర్వాత ప్రకటిస్తామన్నారు. సైన్స్ ఫెయిర్ల నుంచి పదో తరగతి బాలబాలికలను ప్రభుత్వం మినహాయించిందన్నారు.

ఇళ్ల సర్వే వేగవంతం : జేసీ

ఏలూరు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి):పేదల ఇళ్లకు సంబంధించిన సర్వేతో పాటు భూముల రీ సర్వేను వేగవంతంగా పారదర్శకంగా చేపట్టాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎంజే అభిషేక్ గౌడ ఆదేశించారు. కలెక్టరేట్‌లో కైకలూరు నియోజకవర్గ తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, సర్వేయర్లతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ రెవెన్యూశాఖాపరంగా ప్రజల సంతృప్తి స్థాయి పెరగాలని, పీజీఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదన్నారు. ఈనెల 16న నిర్వహించనున్న 22ఏ భూముల పరిష్కారం మెగా సదస్సుకు అన్ని రికార్డులతో రావాలని ఆదేశించారు. డీఆర్వో వి.విశ్వేశ్వరరావు, ఆర్డీవో అచ్యుత్ అంబరీష్ పాల్గొన్నారు.

నేటి నుంచి సహకార ఉద్యోగుల నిరసన

ఏలూరు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి):ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా తమ దీర్ఘకాలిక అపరిష్కృత సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నేటి నుంచి సహకార ఉద్యోగులు నిరసన బాట పట్టనున్నారు. జీవో 36 అమలు చేయాలని, పెండింగ్ వేతన సవరణ, ఉద్యోగ విరమణ వయస్సు 62 ఏళ్లకు పెంచాలన్న డిమాండ్లపై ఉద్యోగులు తొలిరోజు శనివారం డీసీసీబీ, డీసీఎంఎస్, సొసైటీల వద్ద నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరు కానున్నారు. 258 సహకార సంఘాల్లో 1400 మందికి పైగా సిబ్బంది నల్లబ్యాడ్జీలతో విధులు హాజరయ్యేందుకు సమాయత్తం అవుతున్నారు.

రైతుల సమస్యలు పరిష్కరించేందుకే గ్రామసభలు

- స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ చంద్రశేఖర్

జీలుగుమిల్లి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి):పోలవరం నిర్వాసితులకు తమ భూముల్ని అమ్మే గిరిజనేతర రైతులకు సక్రమంగా నష్టపరిహారం అందజేసేందుకు, వారి సమస్యలను పరిష్కరించేందుకే గ్రామసభలు నిర్వహిస్తున్నామని స్పెషల్ డిప్యూటీ కలెక్టరు డి.చంద్రశేఖర్ అన్నారు. 'మొక్కుబడిగా ఆర్అండ్ఆర్ గ్రామసభలు' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో శుక్రవారం వచ్చిన కథనానికి ఆయన స్పందించారు. రైతులకు గ్రామసభ నిర్వహణ సమాచారం ముందుగా తెలియజేస్తామన్నారు. పూచికపాడులో శుక్రవారం ప్రజా ప్రతినిధులు, రైతులతో రెవెన్యూ అధికారులు గ్రామసభ నిర్వహించారు. అంకన్నగూడెం పంచాయతీలో 44.97 ఎకరాల్లో ఆర్అండ్ఆర్ భూములు కొనుగోలు చేస్తున్నామన్నారు. అందుకు సంబంధించిన రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. క్షేత్రస్థాయిలో ఆయా భూముల సర్వేలో పొరపాట్లు ఉంటే రైతులు అధికారులకు ఫిర్యాదు చేయవచ్చన్నారు. జడ్పీటీసీ మల్లం వసంత్, సొసైటీ అధ్యక్షుడు సరిపల్లి సత్యనారాయణ రాజు, మాజీ సర్పంచ్ పైడా వెంకటేశ్వ రావు, వీఆర్వో తిరుపతమ్మ, వీఆర్ఏలు రవి, సుబ్బారావు, రైతులు పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న ఎస్‌డీసీ చంద్రశేఖర్

దేశ నిర్మాణంలో యువత పాత్ర కీలకం

- రాజకీయాలకు అతీతంగా విద్యాభివృద్ధే లక్ష్యం
- మెగా పీటీఎంలో మంత్రి కొలుసు పార్థసారథి



తల్లిదండ్రుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సారథి

నూజివీడు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి):'దేశ నిర్మాణంలో యువత పాత్ర కీలకం. దేశానికి, రాష్ట్రానికి ఆస్తి విద్యార్థులే.. విద్యను రాజకీయాలకు అతీతంగా ఉంచుతూ విద్యార్థులకు స్ఫూర్తి కలిగించేలా చరిత్రను, సంస్కృతిని గుర్తు చేసేలా సేవలందించిన వ్యక్తులు పేర్లను ప్రభుత్వ పథకాలకు పెట్టి వాటిని సమర్థ వంతంగా అమలు చేస్తున్నాం' అని రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. నూజివీడు బాలికోన్నత పాఠశాలలో శుక్రవారం మెగా పీటీఎం 3.0 కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 'తల్లికి వందనం కింద 67.50 లక్షల మంది విద్యార్థులకు రూ.10 వేల కోట్లు అందజేశాం. కూటమి ప్రభుత్వం రాగానే రాజకీయ నాయకుల ఫొటోలు, రంగులు తీసేయమని ఆదేశాలు జారీ చేశాం. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకం కింద లక్షలాది మంది విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం అందిస్తున్నాం. 16,347 టీచర్లను నియమించాం. బాలికలకు, మహిళలను గౌరవించడం చిన్న వయస్సు నుంచే నేర్పించాలి. బాల్య వివాహాలు జరగకుండా చూడాలి' అన్నారు. రూ.97.40 లక్షలతో నిధులతో బాలి కల గ్రంథాలయం, కెమిస్ట్రీ, బయాలజికల్ ల్యాబ్‌లు, పలు అభివృద్ధి కార్యక్రమా లను మంత్రి ప్రారంభించారు. సబ్ కలెక్టర్ వినూత్న, డీవైఈవో సుధాకర్, తహసీల్దార్ బద్రు, ఎంపీడీవో రాఘవేంద్రనాథ్, మునిసిపల్ కమిషనర్ పీరయ్య, ఎంఈవో వరప్రసాద్, మునిసిపల్ వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణ, ఫ్లోర్ లీడర్ చెరుకూరి దుర్గాప్రసాద్, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ నేరుసు నాగులు, హెచ్ఎం బొమ్మిశెట్టి అనురాధ, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

మెగా పీటీఎం సక్సెస్

- జిల్లాలో 1.19 లక్షల మంది విద్యార్థులు, తల్లిదండ్రులు హాజరు

ఏలూరు అర్బన్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి):ప్రభుత్వ పాఠశాలల్లో శుక్రవారం నిర్వహించిన మెగా పీటీఎం 3.0 విజయవంతమైందని డీఈవో వెంకటలక్ష్మమ్మ, సమగ్రశిక్ష జిల్లా ఏపీసీ పంకజ్‌కుమార్ తెలిపారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, కలెక్టర్, జేసీతోపాటు 1,748 ఎంపీపీ, ఎయిడెడ్, సోషల్ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్, ఏపీ రెసిడెన్షియల్, కేజీబీవీ పాఠశాలల్లో 1.19 లక్షల మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఎస్ఎంసీ సభ్యులు, పూర్వ విద్యార్థులు, సేవాసంస్థల ప్రతినిధులు, దాతలు ఉత్సాహంగా పాల్గొన్నారని వివరించారు. సమావేశంలో పేరెంట్స్ నుంచి వచ్చిన సూచనలను క్రోడీకరించి భవిష్యత్తులో మరింత అభివృద్ధి సాధించడానికి పీటీఎంలు ఉపయోగపడ్డాయన్నారు.

రూటు మార్చిన రేషన్ మాఫియా

రేషన్ మాఫియా జడలు విప్పుతోంది. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా నుంచి బియ్యం అక్రమంగా ఇతర జిల్లాలకు, ఆపై విదేశాలకు తరలుతోంది. రేషన్ బియ్యం రీసైక్లింగ్ కట్టడికి ప్రభుత్వం ఎన్ని చర్యలు తీసుకున్నా ఫలితం కనిపించడం లేదు. విజిలెన్స్ అధికారులు వ్యాపారులపై దాడులు చేస్తున్నా వారు వెనక్కి తగ్గడం లేదు. ఫలితంగా ప్రతీ నెల టన్నుల కొద్దీ బియ్యం చెన్నై పోర్టుకు అక్కడి నుంచి విదేశాలకు ఎగుమతి అవుతోంది. రేషన్ బియ్యంలో వున్న పోషకాలపై ప్రజలకు అవగాహన కల్పించడంలో విఫలం కావడమే విక్రయాలకు కారణంగా కనిపిస్తోంది.

- ఉమ్మడి పశ్చిమ నుంచి చెన్నై పోర్టుకు.. అక్కడ నుంచి విదేశాలకు ఎగుమతి
- 40 శాతం రేషన్ బియ్యం మళ్లీ మార్కెట్‌లోకే..
- రీసైక్లింగ్‌కు వెనుకాడని వ్యాపారులు

(ఏలూరు/భీమవరం-ఆంధ్రజ్యోతి)

భారత ఆహార సంస్థకు జిల్లాలో బియ్యాన్ని అప్పగిస్తుంటారు. ప్రభుత్వం మిల్లర్లకు లక్ష్యాలను నిర్దేశిస్తుంది. అందుకే ఇక్కడ కొద్దిమంది తప్ప మిల్లర్లు రీసైక్లింగ్‌కు సాహసించడం లేదు. అదే తూర్పు గోదావరి జిల్లాలో భారత ఆహార సంస్థకు అంతగా కేటాయించడం లేదు. దీంతో రేషన్ బియ్యాన్ని వ్యాపారులంతా అదే జిల్లాకు తరలిస్తున్నారు. జిల్లా నుంచి ప్రధాన రహదారులపై పొరుగు జిల్లాకు వెళుతున్నాయి. దీంతో అక్కడ వ్యాపారులు డెన్‌లు ఏర్పాటు చేసి జిల్లా నుంచి రేషన్ బియ్యాన్ని సేకరిస్తున్నారు. తాడేపల్లిగూడెం కేంద్రంగానే ఓ డెన్ నడిచింది. ఇటీవల దానిపై ఉక్కుపాదం మోపారు. ఇతర జిల్లాల నుంచి వ్యాపారులు ఇక్కడకు వస్తున్నారు. రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నారు.

40 శాతం పక్కదారి

పశ్చిమగోదావరిలో ప్రతి నెలా 8,750 టన్నుల బియ్యాన్ని రేషన్ లబ్ధిదారులకు అందజేస్తున్నారు. గతం లో కేవలం ఖరీఫ్ బియ్యాన్ని ఇచ్చేవారు. ఇప్పుడు రబీలో ఉత్పత్తి అవుతున్న బియ్యాన్ని పంపిణీ చేస్తున్నారు. ప్రతి నెలా 40 శాతం రేషన్ బియ్యం మార్కెట్‌కు తరలిపోతోంది. అంటే ప్రతినెలా 3,500 టన్నుల బియ్యం మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. వినియోగదారులే వ్యాపారులకు అమ్ముతున్నారు. డిమాండ్‌ను బట్టి గరిష్ఠంగా కిలో రూ.15 లకు కొంటున్నారు. అదే బియ్యం ఇతర దేశాలకు కిలో రూ.40కు అమ్ముడుపోతోంది. గతంలో కాకినాడ వ్యాపారుల వద్దకు రేషన్ బియ్యమంతా చేరేది. ఇప్పుడు తూర్పు గోదావరి జిల్లాకు తరలివెళుతోంది.

రేషన్ బియ్యమే గిట్టుబాటు

గతంలో తూర్పు గోదావరి, కాకినాడ జిల్లాలకు చెందిన మిల్లర్లు జిల్లా నుంచి ధాన్యం కొనుగోలు చేసే వారు. తాడేపల్లిగూడెం, తణుకు మండలాల్లో ఇతర దేశాల్లో డిమాండ్ వున్న రకాలను పండిస్తుంటారు. ఇటీవల విదేశాలకు ఎగుమతులు గిట్టుబాటు కావడం లేదంటూ ప్రైవేటు వ్యాపారులు కొనుగోలు చేయడం లేదు. లేదంటే ప్రభుత్వ మద్దతు ధరకంటే అధికంగా చెల్లించి కొనుగోలు చేసేవారు. ఇప్పుడా పరిస్థితి లేదు. ఇతర జిల్లాల మిల్లర్లు జిల్లాలోని ధాన్యం కొనుగోలుకు ఆసక్తి చూపడం లేదు. అంతా ప్రభుత్వానికి అమ్మకాలు సాగిస్తున్నారు. ఫలితంగా ఇతర దేశాలకు ఎగుమతి చేయాలన్నా, రీసైక్లింగ్ చేయాలన్నా రేషన్ బియ్యం గిట్టుబాటు అవుతోంది. వీటిపైనే వ్యాపారులు ఎక్కువగా ఆధారపడుతున్నారు. ఎగుమతులు చేస్తున్నారు.

ఎన్నెన్నో ఆరోగ్య పోషకాలు

గతంలో రేషన్ బియ్యం ముతగ్గా.. రాళ్లు, బెడ్డలతో ఉండేవి. అందువల్ల వాటిని తినడానికి ఇష్టపడేవాళ్లు కాదు. కానీ ఇప్పుడు ప్రభుత్వం నాణ్యమైన బియ్యాన్ని ఇస్తోంది. వీటిని లబ్ధిదారులకు ఉచితంగా ఇవ్వడానికి ప్రభుత్వం కిలోకు రూ.46 భరిస్తోంది. అంటే కిలో రేషన్ బియ్యం రవాణా, నిర్వహణ చార్జీలతో కలిపి రూ.50 అవుతుంది. బియ్యంలో నూక, రాళ్లు వంటి వాటిని నివారించడానికి సార్టెక్స్ మిషన్లను

- మిగతా 8వ పేజీలో

ఏలూరు జిల్లాలో నెలకు 120 లారీలకు పైనే..

పౌరసరఫరాల మంత్రి ఇన్‌చార్జిగా ఉన్న ఏలూరు జిల్లాలోను రేషన్‌మాఫియాకు అడ్డుకట్ట పడడం లేదు. పాతసీసాలో కొత్తసారా చందంగానే వైసీపీ నేతలతో, గతంలో బియ్యం అక్రమంగా తోలకాలు చేసిన చోటా, బడా నేతలతో కొందరు కూటమి నేతలు కుమ్మక్కయ్యారు. ప్రస్తుతం కొన్నిచోట్ల ప్రజా ప్రతినిధులు అనుచరగణం పేరు మీదుగా రేషన్ మాఫియాకు బలం చేకూర్చి కాసులు దండుకుంటున్నారు. ఏలూరు జిల్లా నుంచి తాడేపల్లిగూడెంలో కొన్నిచోట్ల రేషన్ బియ్యం రీసైకింగ్ జరుగుతోంది. తర్వాత మండపేట, రావులపాలెం, పిఠాపురాల్లో రేషన్ మాఫియా ముఠా రేషన్ బియ్యం వ్యాపారాన్ని మూడు పువ్వులు, ఆరు కాయలుగా చేస్తున్నారు. ఏలూరు బైపాస్ నుంచి నల్లజర్ల మీదుగా దేవరపల్లి వయా రాజమండ్రి కాకినాడ పోర్టుకు చేర్చుతున్నారు. భీమడోలు -గుండుగొలను జాతీయ రహదారి లోపలకు గోడౌన్లు ద్వారా చేర్చి సరుకును మాఫియా దారి మళ్లిస్తోంది. జిల్లాలో 28 మండలాలుండగా, రేషన్ పంపిణీ పూర్తైన నెలలో కనీసం ప్రతీ మండలంలో 5 నుంచి 6 లారీల సరుకు కాకినాడ పోర్టు ద్వారా విదేశాలకు ఎగుమతి జరుగుతోంది. రైతుల నుంచి కొన్న 1010 రకం బియ్యాన్ని కొద్దినెలలుగా రేషన్ షాపుల ద్వారా పంపిణీ చేస్తున్నారు. కనీసం పదిశాతం కూడా ప్రజలు తినకుండా మొత్తంగా సంచుల్లోనే బియ్యం దుకాణాల్లో, ఇంటికి వచ్చే మోటారు సైకిళ్లు, చిరు వ్యాపారులకు కిలో 12 నుంచి 15 వరకు అమ్మేస్తున్నారు. తాడేపల్లిగూడెం వద్ద ఈ బియ్యం 18 రూపాయలకు, కాకినాడ వద్ద క్వింటాకు 3,200కు బ్రోకర్లు కొని ఎక్కువ ధరకు అమ్ముతున్నారు. అత్యధికంగా వీరే మార్జిన్ ఎక్కువ పొందుతున్నట్టు ఆరోపణలున్నాయి. సగటున ప్రతీ నెల 120 లారీలు వరకు బియ్యం లోడులారీలు తరలిపోతున్నాయి. ఈ అక్రమాలను అడ్డుకోకుండా చూస్తూ ఉంటున్న అన్నిశాఖలకు భారీగానే మాఫియా చేతులు తడుపుతున్నారే ఆరోపణలున్నాయి.

స్క్రబ్ టైఫస్.. అప్రమత్తం

- వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారుల సమీక్ష
- జ్వర పీడితుల ఆరోగ్య చరిత్రను తెలుసుకోండి
- ఐదు రోజులపాటు జ్వరం తగ్గకపోతే జీజీహెచ్‌కు రిఫర్ చేయాలని సూచనలు

ఏలూరు అర్బన్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి):జిల్లాలో ఇద్దరికి స్క్రబ్ టైఫస్ పాజిటివ్ నమోదు కావడంతో అప్రమత్తమైన జిల్లా వైద్య ఆరోగ్య శాఖ శుక్రవారం నుంచి ముందస్తు జాగ్రత్తలపై దృష్టి సారించింది. మరోవైపు స్క్రబ్ టైఫస్‌కు గురై ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అమ్మపాలెంకు చెందిన ఓ గృహిణి ఆరోగ్య స్థితి మెరుగుపడడంతో వైద్యాధికారులు ఊపిరి పీల్చుకున్నారు. డీఎంహెచ్‌వో డాక్టర్ పీ.జే.అమృతం మాట్లాడుతూ జిల్లాలో కొత్తగా స్క్రబ్ టైఫస్ కేసులేవీ శుక్రవారం నమోదు కాలేదన్నారు. వైద్య ఆరోగ్య శాఖ రాష్ట్ర ఉన్నతాధికారులు జిల్లాల డీఎంహెచ్‌వోలు, ప్రభుత్వాసుపత్రుల సూపరింటెండెంట్లతో నిర్వహించిన జూమ్ సమావేశంలో పలు సూచనలు చేశారు. జ్వరంతో పీహెచ్‌సీ/ప్రభుత్వాసుపత్రులకు వచ్చే రోగుల నుంచి వారి ఆరోగ్య చరిత్రను సమగ్రంగా తెలుసుకోవాలని, వరుసగా ఐదు రోజులుగా జ్వరం తగ్గకపోతే కేసును జీజీహెచ్‌లకు రిఫర్ చేయాలని ఆదేశించారు. ఇటువంటి రోగుల వివరాలను ఆరోగ్యశాఖ సర్వైలెన్స్ విభాగానికి తెలపాలని సూచించారు. జ్వరాలపై అవగాహన కార్యక్రమాలు, ముందస్తు జాగ్రత్తలపై గ్రామాల్లో విస్తృత ప్రచారం చేపట్టాలని కోరారు. అన్ని ప్రభుత్వాసుపత్రుల్లో యాంటీ బయాటిక్స్ మందుల నిల్వలను ఉంచామన్నారు. కాగా స్క్రబ్ టైఫస్ నిర్ధారణతో ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న మహిళను శనివారం డిశ్చార్జి చేసే అవకాశం ఉంది.



ఏలూరులో అవగాహన ర్యాలీ

ఏలూరు అర్బన్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి):స్క్రబ్ టైఫస్ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని, పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత ప్రతీ ఒక్కరూ పాటించాలని కోరుతూ శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ మలేరియా విభాగం ఆధ్వర్యంలో సత్రంపాడు, పరిసర ప్రాంతాల్లో వైద్య సిబ్బంది అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఏలూరు సబ్ యూనిట్ మలేరియా అధికారి గోవిందరావు మాట్లాడుతూ ఏటా శీతాకాలంలో స్క్రబ్ టైఫస్ కేసులు నమోదవుతాయని, ఆందోళన చెందనక్కర్లేదన్నారు. అధిక జ్వరం, తీవ్ర తలనొప్పి, కండరాల నొప్పులు, నల్లి కుట్టిన చోట నల్లటి పుండులాంటి మచ్చ, దద్దుర్లు, వణుకు, గ్రంధులు ఉబ్బడం వంటి అనారోగ్య లక్షణాలు కనిపిస్తే వైద్యులను సంప్రదించాలన్నారు. వైద్యాధికారి దీప్తి, సిబ్బంది లక్ష్మి, అరుణ్‌కుమారి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

137

జిల్లాలో పెరిగిన పోలింగ్ కేంద్రాల సంఖ్య



(ఫైల్)

- 1,200 మంది ఓటర్లు వుంటే అదనంగా ఏర్పాటు
- 1,744 నుంచి 1,881కు పెరిగిన కేంద్రాలు.. త్వరలో ఎన్నికల సంఘం గ్రీన్‌సిగ్నల్

(ఏలూరు-ఆంధ్రజ్యోతి)

జిల్లాల పునర్విభజన తర్వాత అక్కడక్కడ పోలింగ్ కేంద్రాల విషయంలో లోపాలు తలెత్తడంతో పాటు, గతంలో వినియోగంలో ఉన్న కేంద్రాల్లో సౌకర్యాలు లేనివాటి విషయంలో తాజాగా మార్పులు, చేర్పులకు ఇటీవల జిల్లా యంత్రాంగం శ్రీకారం చుట్టింది. జిల్లాలోని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో కలెక్టర్, డీఆర్వో, ఇతర అధికారులు కసరత్తులు చేస్తున్నారు. ప్రతీ నియోజకవర్గం వారీగా ఓటర్లకు ఇబ్బందులు తలెత్తకుండా రేషనలైజేషన్ చేశారు. 1200 మంది ఓటర్లున్న కేంద్రం వద్ద అదనంగా మరో కేంద్రాన్ని ఏర్పాటుకు సిఫార్సు చేశారు. బడులు, వివిధ సంస్థల కార్యాలయాల్లో ఉన్న వాటిని మౌలిక వసతులుండేలా మార్పులు చేర్పులకు అవకాశం కల్పించారు. దీంతో జిల్లా వ్యాప్తంగా 1,744 పోలింగ్ కేంద్రాలుండగా, మార్పులు, చేర్పులతో వాటి సంఖ్య 1881కు పెంపు జరగనుంది. ఓవరాల్‌గా మొత్తం 137 పోలింగ్ కేంద్రాలు జిల్లాలో పెరగనున్నట్టు అధికారులు చెబుతున్నారు. ప్రతీ ఒక్కరు తమ ఓటును సద్వినియోగం చేసుకునే దిశగా ఎన్నికల సంఘం పలు సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. ఏటా ఓటర్ల జాబితా సవరణలను పారదర్శకంగా చేపడుతోంది. నిరంతరం ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులకు ఎన్నికల సంఘం ఆదేశించింది. ఏడాది పొడవునా ఓటరు చేర్పులు, మార్పులకు శ్రీకారం చుట్టింది. ప్రస్తుతం ఉన్న చోట్ల నుంచి మరొక చోటికి ఉంగుటూరులో 3, దెందులూరు, ఏలూరులో ఒక్కొక్క కేంద్రం, పోలవరంలో 2, చింతలపూడిలో 5, నూజివీడులో ఏడేసి కేంద్రాల చొప్పున మార్పులను చేపట్టారు. వీటిపై కలెక్టర్ కె.వెట్రిసెల్వి తుది నిర్ణయం తీసుకోవడంతో యంత్రాంగం ఎన్నికల కమిషన్‌కు నివేదించింది. త్వరలో అధికారంగా పెరిగిన పోలింగ్ కేంద్రాల ప్రకటన జాబితా వెలుడనుంది.

ఏలూరు జిల్లాలో పోలింగ్ కేంద్రాలు..

నియోజకవర్గం (కోడ్)	పోలింగ్ కేంద్రాలు	పెంచిన సంఖ్య	మొత్తం కేంద్రాలు
ఉంగుటూరు(63)	214	21	235
దెందులూరు(64)	239	09	248
ఏలూరు (65)	213	34	247
పోలవరం (67)	284	41	325
చింతలపూడి(68)	273	18	291
నూజివీడు(70)	286	05	291
కైకలూరు(73)	235	09	244
	1744	137	1881



ధర్మాజీగూడెం జడ్పీ హైస్కూలులో క్లిక్కర్ డివైజ్‌లను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

డిజిటల్ బోధనలో క్లిక్కర్లు

- జిల్లాలో రెండు జడ్పీ హైస్కూళ్ల విద్యార్థులకు అందజేత

ఏలూరు అర్బన్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి):తరగతి గది డిజిటల్ బోధనలో భాగంగా విద్యార్థులకు ఆధునిక సాంకేతికతను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. రాష్ట్రవ్యాప్తంగా ఎంపిక చేసిన ప్రభుత్వ పాఠశాలల్లో 9వ తరగతి పాఠ్యాంశాలపై టీచర్లు అడిగే ప్రశ్నలకు బాల బాలికలు జవాబులిచ్చేందుకు క్లిక్కర్ డివైజ్‌లను పంపిణీ చేసింది. పైలట్ ప్రాజెక్టుగా చేపట్టిన ఈ కార్యక్రమానికి జిల్లాలో ఎంపిక చేసిన కొవ్వలి, ధర్మాజీగూడెం జడ్పీ హైస్కూళ్లకు మొత్తం 80 డివైజ్‌లను సమగ్ర శిక్ష జిల్లా అధికారులు శుక్రవారం అందజేశారు. మెగా పీటీఎం సందర్భంగా లాంఛనప్రాయంగా వీటిని విద్యార్థులకు పంపిణీ చేసి, ప్రశ్నలకు వ్యక్తిగతంగా జవాబులిచ్చే విధానాన్ని పరిశీలించారు. క్లిక్కర్ పరికరాల ప్రత్యేకత, వినియోగంపై సమగ్రశిక్ష జిల్లా సహాయ గణాంకాధికారి ఆర్.రామకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వం పాఠశాలలకిచ్చిన ఐఎఫ్‌పీ ప్యానెళ్ల ద్వారా డిజిటల్ విధానంలో ఇప్పటికే పాఠ్యాంశాల బోధన జరుగుతోందన్నారు. 9వ తరగతి పాఠ్యాంశాలను టైంటేబుల్ ప్రకారం బోధించిన అనంతరం పాఠ్యాంశంపై విద్యార్థులకు ప్రశ్నలను సంధించి, వాటికి వ్యక్తిగతంగా జవాబులను రాబట్టడం ద్వారా అభ్యసనా సామర్థ్యాలు, అవగాహన తెలుసుకోవడానికి క్లిక్కర్ డివైజ్‌లను ఉద్దేశించారన్నారు. విద్యార్థులు ఇచ్చిన జవాబులు ఐఎఫ్‌పీ ప్యానెల్‌పై డిస్‌ప్లే అవుతాయన్నారు. ఈ విధానం విజయవంతమైతే వచ్చే విద్యాసంవత్సరం నుంచి ఐఎఫ్‌పీ ప్యానెళ్లువున్న అన్ని పాఠశాలలు, తరగతులకు విస్తరించే అవకాశం ఉందన్నారు. సమగ్రశిక్ష ఏఎల్ఎస్ కో-ఆర్డినేటర్ ఎస్.నాగేశ్వరరావు, సీఎంవో డి.యెహోషువ, విలీనవిద్య కో-ఆర్డినేటర్ భాస్కరరాజు, జీసీడీవో బి.నవీన, హెచ్ఎంలు పాల్గొన్నారు.

పంచాయతీ వ్యవస్థ బలోపేతం

- ఉమ్మడి పశ్చిమలో 7 డీడీవో కార్యాలయాలు ప్రారంభం
- ఒకేచోట డీఎల్‌పీవో, డ్వామా ఏపీడీ ఇతర ఆఫీసులు

■ లోపలి పేజీలో..






వాడిన విగ్రహాలు!

మహనీయుల జ్ఞాపకాలకు గురుతులు విగ్రహాలు. వీటిని చూసినప్పుడు ఆయా రంగాలకు వారు చేసిన సేవలు గుర్తుకువస్తాయి. ఇందుకు వారి జయంతి, వర్ధంతులను ఎంతో ఆర్భాటంగా చేస్తాం. విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులర్పిస్తాం. వారు చేసిన సేవలను స్మరించుకుంటాం. ఇంత వరకు బాగానే వుంది. కాని, ఆయా కార్యక్రమాలు పూర్తయిన వెంటనే ఆ విగ్రహాలను మళ్లీ ఏడాది వరకు పట్టించుకోం. వేసిన దండలు వాడిపోయినా నెలల తరబడి తొలగించం. ఏలూరు, దెందులూరుల్లోని జాతీయ నాయకులు, ప్రముఖుల విగ్రహాలను చూడండి. ఈ దండలు వేసి ఎన్నాళ్లయ్యిందో..? నివాళులు ఇలాగేనా..?

- ఫొటోగ్రాఫర్ (ఏలూరు-ఆంధ్రజ్యోతి)

శివరాత్రి ఉత్సవాలకు శ్రీకారం


ఆచంటేశ్వర స్వామి సన్నిధిలో విఘ్నేశ్వర స్వామి ఆలయానికి బియ్యం తెస్తున్న ఆలయ ఈవో, చైర్మన్

ఆచంట, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి):ప్రశిద్ధి చెందిన ఆచంటేశ్వరుని సన్నిధిలో వచ్చే సంవత్సరం ఫిబ్రవరిలో జరిగే మహాశివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం స్వామి వారి సన్నిధిలో విఘ్నేశ్వరుడికి బియ్యం కట్టి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ముందుగా విఘ్నేశ్వరుడికి ప్రత్యేక పూజలు చేసి అనంతరం ఈశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో ఆదిమూలం వెంకట సత్యనారాయణ, ఆలయ చైర్మన్ నెక్కంటి గజేశ్వరరావు, కమిటీ సభ్యులు, పలువురు భక్తులు పాల్గొన్నారు.

కుంకుళ్లమ్మకు పంచహారతులు



ద్వారకాతిరుమల, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): క్షేత్రదేవతగా కొలువుదీరిన కుంకుళ్లమ్మవారు మార్గశిర మాస శుక్ర వారం నాడు ప్రత్యేక పుష్పాలంకరణలతో భక్తులకు దర్శనమిచ్చారు. గ్రామశివారు దేవతైన అమ్మవారిని శ్రీవారి దర్శనానికి విచ్చేసిన భక్తుల్లో అధికశాతం మంది మార్గమధ్యలో ఈ ఆలయంలో దర్శిం చుకుని తరిస్తుంటారు. ఈక్రమంలో శుక్రవారం విశేషపుష్పాలతో అలంకృతులైన అమ్మవారిని భక్తులు దర్శించుకుని కుంకుమ పూజలు జరిపించుకున్నారు. అనంతరం అర్చకులు అమ్మకు పంచహారతులు ఇచ్చారు.



అవగాహన కార్యక్రమంలో విద్యార్థులతో పోలీసు అధికారులు, కళాశాల సిబ్బంది

మహిళల భద్రత కోసం పోష్ చట్టం

పెదపాడు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి):మహిళల భద్రత, సమాజంలో గౌరవం, హక్కుల పరిరక్షణకు, ఉద్యోగ ప్రదేశంలో సురక్షిత వాతావరణం, లైంగిక వేధింపుల నుంచి రక్షణ కోసం పోష్ చట్టం పనిచేస్తుందని మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ యు.రవిచంద్ర తెలిపారు. వట్లూరు సర్‌సీఆర్‌రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో కళాశాల అంతర్గత ఫిర్యాదు సంఘం, మహిళా సెల్ విభాగం, ఎన్.ఎస్.ఎస్.ల సంయుక్త ఆధ్వర్యంలో ఉద్యోగ స్థలంలో సామరస్యం - పోష్ చట్టంపై అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. డీఎస్పీ రవిచంద్ర మాట్లాడుతూ ఈ చట్టం ప్రకారం ఎలాంటి వేధింపులు జరిగినా మహిళ వెంటనే ఫిర్యాదు చేయవచ్చునని పేర్కొన్నారు. సీఐ ఎం.సుబ్బారావు, ఎస్సై బి.నాగమణి, కళాశాల కరస్పాండెంట్ జాస్తి మల్లికార్జునుడు, హరిరామకృష్ణం రాజు, ప్రిన్సిపాల్ డాక్టరు కె.వెంకటేశ్వరరావు, కన్వీనర్ డాక్టరు ఐ.హేమలత పాల్గొన్నారు.


రోబోటిక్స్‌పై అవగాహన తరగతులు నిర్వహిస్తున్న దృశ్యం

భవిష్యత్ అంతా రోబోటిక్స్‌దే

లింగపాలెం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి):లింగపాలెం మండలం ధర్మాజీగూడెం క్రిశాలిస్ పాఠశాలలో రెండో రోజు రోబోటిక్స్‌పై అవగాహన కార్యక్రమం, ప్రత్యేక తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్లు క్రాంతి కుమార్, విజయ్ మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మక ఆలోచనలను ప్రోత్సహించడంతోపాటు సాంకేతిక రంగంలో ఎదగాలన్న లక్ష్యంతోనే ఈ అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా సమాజంలో అట్టడుగు వర్గాల నుంచి వస్తున్న విద్యార్థులు సైతం నూతన ఆవిష్కర్తలుగా, సాంకేతిక నిపుణులుగా ఎదిగేందుకు తోడ్పడతాయన్నారు. మండలంలోని పలు పాఠశాలల నుంచి విద్యార్థులు పాల్గొన్నారు.


తుపాకులతో మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న సాయుధ బలగాలు

ఉగ్రవాదులు దాడి చేస్తే ఏం చేయాలి ?

నిట్‌లో ఆక్టోపస్ మాక్‌డ్రిల్

తాడేపల్లిగూడెం అర్బన్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి):తాడేపల్లిగూడెం ఏపీ నిట్‌లో శుక్రవారం ఆక్టోపస్ కమెండోస్ డీఎస్పీ రాంబాబు ఆధ్వర్యంలో మాక్ డ్రిల్ నిర్వహించారు. ఉగ్రవాదులు దాడి చేస్తే వారిని సమర్థవంతంగా ఎలా ఎదుర్కోవాలి, ఆత్మరక్షణ ఎలా పొందాలి, ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా బాధి తులను ఎలా రక్షించాలి అనే దానిపై అవగాహన కలిగించారు. విపత్కర పరిస్థితులు ఎదురైనప్పుడు రక్షణ వ్యవస్థను అప్రమత్తం చేసే విధానంతోపా టు ఉగ్రవాదులు చొరబడిన భవనం, పరిసరాలు లోపలకు, బయటకు వెళ్లే మార్గాలు, భవనంలో ఎంతమంది చిక్కుకుపోయారు. బాంబులను అమర్చారా, సీసీ కెమెరాల ద్వారా అనుమానితులను గుర్తించే వాటిపై అవగాహన కల్గించారు. ఈ సందర్భంగా ఆక్టోపస్ కమాండోస్ డీఎస్పీ రాంబాబు మాట్లాడుతూ విపత్కర పరిస్థితులు ఎదురైనప్పుడు పోలీసులు, రెవెన్యూ, ఇంటెలిజెన్స్, హెల్త్ తదితర శాఖలను సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్ళాలన్నారు. డీఎస్పీ విశ్వనాద్, ఇన్‌స్పెక్టర్లు శివాజి, నీలకంఠ, సీఐ ఆదిప్రసాద్ పాల్గొన్నారు.

పోలీసుకు ప్రతిష్ట హోంగార్డ్స్

నేడు 63వ ఆవిర్భావ దినోత్సవం.. ఉమ్మడి జిల్లాలో 580 మంది సేవలు

ఏలూరు క్రైం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): సమాజంలో శాంతి భద్రతలు కాపాడడంలో పోలీస్‌శాఖ అహర్నిశలు కష్టపడుతున్నది. కానీ వారితో పాటే సమాంతరంగా రేయనకా పగలనకా వాననకా ఎండనకా విధినిర్వహణలో ఖాకీ యూనిఫాం ధరించి సమర్థవంతంగా విధులను నిర్వర్తిస్తూ పోలీస్‌శాఖకు వెన్నెముఖలా పనిచేస్తున్న హోంగార్డుల సేవలకు ప్రశంసలు అందించక తప్పదు. సేవా దృక్పధంతో గృహ రక్షణదళంగా 1946 డిసెంబరు 6న ముంబైలో హోంగార్డ్సు సంస్థను ఏర్పాటు చేశారు. అప్పట్లో జరిగిన అల్లర్లను అణిచివేయడానికి పోలీసుకు సహాయకారులుగా హోంగార్డులు తమ సేవలను అందించారు. 1962లో చైనాతో యుద్ధం జరుగుతున్న సమయంలో దేశంలోని ప్రజలకు వారి గృహాలకు రక్షణ కోసం హోంగార్డు కీలకపాత్ర పోషించింది. దీనిలో భాగంగానే 1963లో డిసెంబరు 6న రాష్ట్రంలో హోంగార్డ్సు యూనిట్‌ను ఏర్పాటు చేశారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో 1925 ఏప్రిల్ 24న ఏర్పాటు చేశారు. ప్రస్తుతం హోంగార్డ్సు యూనిట్ ఉమ్మడి జిల్లాలోనే ఒక యూనిట్‌గా కొనసాగుతూనే ఉంది. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో మొత్తం 605 హోంగార్డు పోస్టులు ఉండగా ప్రస్తుతం 580 మంది ఉన్నారు. ఏలూరు జిల్లాలో ప్రస్తుతం 380 మంది హోంగార్డ్సు ఉండగా, పశ్చిమ గోదావరిలో భీమవరం యూనిట్‌గా 200 మంది విధులను నిర్వర్తిస్తున్నారు. జిల్లాలో హోంగార్డ్సు విభాగంలో పనిచేస్తున్న హోంగార్డులు పోలీసులతో పాటు సమాంతరంగా విధులను నిర్వర్తిస్తున్నారు. రాత్రి వేళ గస్తీ, ట్రాఫిక్ విధులు, స్టేషన్‌లో సహాయ కారులుగా విధులను నిర్వర్తిస్తున్నారు. అంతేకాకుండా ఓఎన్‌జీసీ, విజిలెన్సు, శెట్టిపేట, విశాఖ స్టీల్‌ప్లాంట్, అగ్నిమాపక శాఖ, భీమవరంలోని మావుళ్ళమ్మ దేవాలయం, ద్వారకాతిరుమలలోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం వద్ద డిప్యూటేషన్‌లో హోంగార్డులు విధులను నిర్వర్తిస్తున్నారు. హోంగార్డులు ఖాకీ యూనిఫాం ధరించి పోలీస్‌శాఖ ప్రతిష్ట పెంచడానికి వారు కష్టించి విధులను నిర్వర్తిస్తూనే ఉన్నారు. నేటికి కూడా వారు రోజువారీ వేతనదారులుగా మిగిలిపోతున్నారు. ఏ రోజు విధుల్లోకి వస్తే ఆ రోజు రోజుకు 710 రూపాయలు చొప్పున గౌరవ వేతనాన్ని ఇస్తారు. నెలలో వేతనంతో కూడిన రెండు సెలవులను మంజూరు చేస్తారు. వారు ఎలాంటి సెలవులు పెట్టుకోవడానికి అవకాశమే లేదు. డ్యూటీ చేస్తేనే వారికి గౌరవవేతనం జీతంగా అందుతుంది. హోంగార్డులు మరణిస్తే ఎక్స్‌గ్రేషియోగా ఐదు లక్షల రూపాయలను ఇన్సూరెన్సుల ద్వారా అందిస్తున్నారు. హోంగార్డులు అందరూ ఒకరి కొకరు ఆర్థికంగా సహాయం చేసుకునే నిమిత్తం నెలకు ఒక్క రోజు వేతనాన్ని స్వచ్ఛందంగా వెల్ఫేర్ ఫండ్‌కు ఇస్తున్నారు. దీంతో ఎవరైనా మరణించినా, పదవి విరమణ చేసినా ఆ ఒక్కరోజు వేతనాన్ని వారికి గౌరవంగా అందిస్తున్నారు. మట్టి ఖర్చులు నిమిత్తం హోంగార్డు చీఫ్ ఆఫీస్ పది వేల రూపాయలను సహాయం అందిస్తుంది. జిల్లాలో పనిచేస్తున్న హోంగార్డ్సు నేరస్తులను అరెస్టు చేయడంలోనూ, ట్రాఫిక్ విధుల్లోనూ వివిధ బందోబస్తుల్లోనూ సమర్థవంతంగా విధులు నిర్వర్తిస్తూ పోలీసు శాఖకు చేదోడువాదోడుగా నిలుస్తున్నారు. వారి సేవలను గుర్తు చేసి వారి మరింత ఉత్సాహాన్ని నెలకొల్పడానికి స్వచ్ఛంద సేవా సంస్థగా ఏర్పడిన హోంగార్డ్సు సంస్థ ఆవిర్భావ దినోత్సవం అయిన నేడు ఏలూరు జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఉదయం 8 గంటలకు ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై హోంగార్డ్సును ఉద్దేశించి ప్రసంగిస్తారు.


హోంగార్డులకు నిర్వహిస్తున్న క్రీడా పోటీలు

హోం గార్డ్సు డేకు రిహార్సల్స్ ఓకే

ఏలూరు క్రైం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి):ఏలూరులోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో శనివారం ఉదయం 63వ హోంగార్డ్సు జరగనున్న దృష్ట్యా ముందస్తుగా హోంగార్డులతో రిహార్సల్స్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఏలూరు జిల్లా ఏఆర్ అదనపు ఎస్పీ జి.మునిరాజా స్వయంగా పర్యవేక్షించారు. హోంగార్డుల ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని హోంగార్డులకు ఆటలపోటీలను కూడా నిర్వహించారు. విజేతలకు శనివారం ఉదయం హోంగార్డ్సు డేకు ముఖ్య అతిథిగా హాజరవుతున్న జీవీజీ అశోక్‌కుమార్ చేతుల మీదుగా బహుతులను, ప్రశంసాపత్రాలను అందిస్తారు.

బీఎస్ఎన్ఎల్ టవర్లు ఏర్పాటు చేయండి


మంత్రి పెమ్మసానికి వినతిపత్రం సమర్పిస్తున్న ఎంపీ మహేశ్

ఏలూరు టూటౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి):ఏలూరు జిల్లాలో పెండింగులో ఉన్న ప్రాంతాల్లో బీఎస్ఎన్ఎల్ టవర్లు ఏర్పాటు చేయాలని కేంద్ర కమ్యూనికేషన్ల మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌కు ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. పార్లమెంట్‌లో కేంద్ర మంత్రిని కలిసి మొబైల్ టవర్ల ఏర్పాటుపై చర్చించి వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఎంపీ మహేశ్ మాట్లాడుతూ ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో మొబైల్ నెట్‌వర్క్ కవరేజ్ సరిగా లేదనే విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. గ్రామీణ, అర్బన్ ప్రాంతాల్లో బీఎస్ఎన్ఎల్ టవర్ల ఏర్పాటు ప్రతిపాదనలు కేంద్రం వద్ద పెండింగులో ఉన్న విషయం మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. సానుకూలంగా స్పంది ంచిన మంత్రి తిమ్మసాని విలైనంత త్వరలో మొబై ల్ టవర్ల ఏర్పాటుకు తగు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారని తెలిపారు. ఇప్పటి వరకు పీఎంయూవై పథకంలో జిల్లాకు 23719 ఎల్‌పీజీ గ్యాస్ కనెక్షన్లు ఇచ్చినట్లు ఎంపీ మహేశ్ తెలిపారు. పార్లమెంట్‌లో ఎల్‌పీజీ కనెక్షన్ల పై మహేశ్ అడిగిన ప్రశ్నపై కేంద్ర మంత్రి సురేశ్‌గోపి సమాధానం ఇచ్చారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ట్రామకేర్ ఎలాంటి సౌకర్యాలు కల్పిస్తున్నారని పార్లమెంట్‌లో ఎంపీ మహేశ్ అడిగిన ప్రశ్నకు సమాధానంగా కేంద్ర మంత్రిత్వ శాఖ ఇచ్చిన సమాచారం మేరకు రాష్ట్రంలో 92కోట్లతో 14ట్రామా కేర్‌సెంటర్లు ఏర్పాటు చేశామన్నారు. ఏలూరు జిల్లా ఆసుపత్రిలో ట్రామాకేర్ సెంటర్‌లో అత్యాధునిక సదుపాయలు కల్పిస్తున్నట్లు ఎంపీ మహేశ్ తెలిపారు.


విద్యార్థినిని అభినందిస్తున్న యాజమాన్యం

యూత్ పార్లమెంట్‌లో రన్నరప్‌గా రమా పార్వతి

తాడేపల్లిగూడెం టౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో నిర్వహించిన యూత్ పార్లమెంట్‌లో రన్నరప్‌గా ఆదిత్యా కళాశాల విద్యార్థిని నిలిచిందని ప్రిన్సిపాల్ లక్ష్మి సరోజ తెలిపారు. యూత్ పార్లమెంట్‌లో నాలుగు రౌండ్‌లు నిర్వహించగా రాజకీయ సామాజిక అంశాలపై చర్చించారని వివరించారు. దీనిలో ద్వారం పూడి రమాపార్వతి రన్నరప్‌గా నిలిచారన్నారు.

ఏపీ నిట్ విద్యార్థుల్లో జోష్

ఉద్యోగాల కల్పనలో ముందంజ


తాడేపల్లిగూడెం ఏపీ నిట్ ప్రాంగణం

తాడేపల్లిగూడెం అర్బన్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెం ఏపీ నిట్‌లో గత ఏడాది చదువు పూర్తి చేసుకున్న విద్యార్థులకు ఉద్యోగాలు ఆశాజనకంగా ఉన్నాయి. ఉద్యోగాల కోసం ఏపీ నిట్ నుంచి 619 మంది విద్యార్థులు రిజిస్టర్ చేసుకున్నారు. అందులో 85 శాతం మందికి క్యాంపస్ సెలక్షన్స్ ద్వారా ఉద్యోగాలు లభించాయి. మరో 5 శాతం మంది విద్యార్థులు కంపెనీలు వ్యక్తి గతంగా నిర్వహించే ఇంటర్వ్యూలలో పాల్గొని ఉద్యోగాలకు ఎంపికయ్యారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న విద్యార్థులలో సుమారు 560 మందికి ఉద్యోగాలు లభించాయి. డిసెంబరు మాసాంతరం వరకు క్యాంపస్ సెలక్షన్స్ కోసం కంపెనీలు రాబట్టేందుకు నిట్ అధికారులు ప్రయత్నిస్తున్నారు. ఐదేళ్ళుగా ఖాళీగా వున్న నిట్ డైరెక్టర్ పోస్టుకు ఇటీవల ఇంటర్వ్యూలు పూర్తి అయ్యాయి. త్వరలోనే నియామకం జరగనుందని నిట్ వర్గాలు ఆశిస్తున్నాయి. ఇది పూర్తి అయితే అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందిని భర్తీ చేస్తారు. కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్న రూ.400 కోట్లు నిధులు విడుదలయ్యే అవకాశం ఉంది.


ఎంపికైన క్రీడా జట్టుతో కరస్పాండెంట్ తదితరులు

ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ ఫుట్‌బాల్ జట్టు ఎంపిక

పెదవేగి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి):డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో యూనివర్సిటీ ఫుట్‌బాల్ జట్టు ఎంపిక పోటీలు శుక్రవారం జరిగాయి. పెదవేగి మండలం దుగ్గిరాలలోని సెయింట్ జోసెఫ్ దంతవైద్య కళాశాలలో శుక్రవారం జరిగిన ఈ ఎంపిక పోటీల్లో మెడికల్, దంత, హోమియోపతి, నర్సింగ్, పారా మెడికల్ విద్యార్థులు పాల్గొన్నారు. కళాశాల కరస్పాండెంట్ ఫాదర్ జి.మోజెస్ పోటీలను ప్రారంభించారు. రాష్ట్రంలోని వివిధ కళాశాలలకు చెందిన 65మంది ఈ పోటీల్లో పాల్గొనగా, ప్రతిభ కలిగిన క్రీడాకారులతో ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ ఫుట్‌బాల్ జట్టును ఎంపిక చేశారు. ఎంపిక చేసిన జట్టు ఈ నెల 24వ తేదీ నుంచి 30 వరకు కేరళ రాష్ట్రంలోని కాలికట్ యూనివర్సిటీలో జరిగే పోటీల్లో పాల్గొంటారని కళాశాల పీడీ ఎన్.నల్లయ్య తెలిపారు.

గొరగనమూడి విద్యార్థులకు అభినందన


క్రీడాకారులను అభినందిస్తున్న సర్పంచ్ గొట్టుముక్కల శివాజీరాజు, హెచ్ఎం

పాలకోడేరు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి):రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ అండర్-14 నెట్‌బాల్ పోటీల్లో రాణించిన గొరగనమూడి స్వామి జ్ఞానానంద జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులను సర్పంచ్ గొట్టుముక్కల శివాజీ రాజు, ప్రధానోపాధ్యాయురాలు శ్రీదేవి శుక్రవారం అభినందించారు. శృంగవృక్షంలో ఇటీవల జరిగిన నెట్‌బాల్ రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణించడమే కాకుండా హైస్కూల్ నుంచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన వారిని సత్కరించారు.

ట్రాఫిక్‌పై అవగాహన కోసం నేడు 3కె రన్

భీమవరం టౌన్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ట్రాఫిక్ పై ప్రజలలో అవగాహన కల్పించేందుకు శనివారం బీవీ రాజు సర్కిల్ నుంచి 3కె రన్ ఉదయం 6-30 గంటలకు ప్రారంభం అవుతుందని కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. అక్కడి నుంచి జువ్వలపాలెంరోడ్‌లోని ఏ.ఎస్.ఆర్ విగ్రహం వరకు కొనసాగుతుందన్నారు. త్రీకె రన్‌లో విద్యార్థిని, విద్యార్థులు, వాకర్స్ అసోసియేషన్స్, అథ్లెట్స్ జిల్లా అధికారులు, ప్రజలు పాల్గొనాలని కోరారు.

చురుగ్గా మ్యాజిక్ డ్రెయిన్ నిర్మాణం



తాడేపల్లిగూడెం రూరల్, డిసెంబరు 5.(ఆంధ్రజ్యోతి):తాడేపల్లిగూడెం మండలం లింగారాయుడుగూడెంలో ప్రభుత్వం పైలెట్ ప్రాజెక్టుగా నిర్మించతలపెట్టిన మ్యాజిక్ డ్రెయిన్ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. 300 మీటర్ల పొడవున రెండు మీటర్ల వెడల్పుతో రూ.2.80 లక్షల వ్యయంతో ఈ మ్యాజిక్ డ్రెయిన్ పనులు చేపడుతున్నారు. భూగర్భ డ్రయినేజి ఏర్పాటు చేసినా అవుట్‌లెట్ లేకపోవడంతో రోడ్లపైకి మురుగునీరు చేరుతుండటంతో గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు రెడ్డి రాము ఆధ్వర్యంలో ఈ పనులు చేస్తున్నారు. డ్రెయిన్ నిర్మాణ పనులను ఏపీవో సుధీర్ పర్యవేక్షించారు

మామిడికి స్వస్తి

పామాయిల్, మొక్కజొన్నపై మొగ్గు

చాత్రాయి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మామిడి పంటకు ప్రసిద్ధి చెందిన చాత్రాయి మండలంలో వరుస నష్టాలు తట్టుకోలేక రైతులు మామిడి తోటలు నరికేస్తున్నారు. 15 ఏళ్ళ క్రితం వరకు ఇక్కడి నుంచి విజయవాడ తరువాత భారీ స్థాయిలో ఢిల్లీ, ముంబాయి, అహ్మదాబాద్, ఇండోర్, చెన్నై తదితర నగరాలకు మామిడి ఎగుమతులు జరిగేవి. గతంలో మండలంలో సుమారు 20 వేల ఎకరాలలో మామిడి తోటలు విస్తరించి ఉండేవి. ఇప్పుడు 5 వేల ఎకరాలకు తగ్గిపోయాయి. మామిడికి ఆదాయం తగ్గిపోవటం, పామాయిల్, మొక్కజొన్న సాగులో మంచి లాభాలు వస్తుండటంతో మామిడి తోటలు నరికి పామాయిల్, మొక్కజొన్న సాగు చేస్తున్నారు. ఒకప్పుడు ఈ ప్రాంత రైతులకు మామిడి పంట కాసుల వర్షం కురిపించింది. తరువాత రైతులు అధిక దిగుబడులు ఆశించి పురుగు మందులు, రసాయనిక ఎరువులు విచక్షణరహితంగా వినియోగించటం వలన మంగు తెగులు వచ్చి నాణ్యత దెబ్బ తింది. దీనికి తోడు ఢిల్లీ సేట్‌ల మార్కెట్ మాయాజాలం వలన ధరలు పతనం కావటం, కోతకూలీ రవాణా ఖర్చులు బాగా పెరగటం వలన రైతులు నష్ట పోయారు. దీనితో మామిడి తోటలు నరకక తప్పని పరిస్థితి.



నరికేస్తూ.. రోడ్డు పక్కన పడేసిన మామిడి చెట్లు

జీవం ఉట్టిపడేలా చిత్రలేఖనం

కాంతారావు చిత్ర లేఖనానికి ప్రశంసలు

ఏలూరు రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : జీవం ఉట్టిపడేలా పెయింటింగ్ వేస్తూ కుంచె కదిపితే అద్భుత చిత్రాలకు రూపమిస్తూ ఏలూరుకు చెందిన మజ్జి కాంతారావు ఔరా అనిపిస్తున్నారు. సామాజికంగా ప్రస్ఫుటమయ్యే అంశాలపై ఆయన చిత్రాలు భావాలను పలికిస్తాయి. చిత్రాలను కళ్లకు కట్టినట్టు చూపడంలో ఆయన నైపుణ్యానికి నిదర్శనం. శుక్రవారం హైదరాబాదులోని జేఎన్టీయూ నెహ్రూ ఆర్ట్ గ్యాలరీలో ఒంగోలు ఆర్ట్ ఫెస్ట్ నిర్వహి ంచారు. భారతదేశ సాంప్రదాయ ఇళ్ల అంశంపై చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. వంద మంది కళాకారులు పాల్గొని వందల చిత్రాలు గీశారు. వీరితో ఏలూరు నగరానికి చెందిన చిత్ర కళాకారులు, మజ్జి సూర్యకాంతారావు, చిత్రీకరించిన సాంప్రదాయకర ఇంటిలో అమ్మ పిండి వంటలు చేస్తున్నట్టు రూపొందించిన చిత్రకళ అందర్నీ ఎంతగానో ఆకట్టుకున్నది. ప్రశంసలు అందుకుంది. ఈసందర్భంగా నిర్వాహకులు కాంతారావుకు ప్రశంసా పత్రం, మెమెంటోతో ఘనంగా సత్కరించారు. పలు కళాశాల సంస్థల ప్రతినిధులు, చిత్రకళాకారులు కాంతారావును అభినందించారు.



సత్కారం అందుకుంటున్న కాంతారావు.. వేసిన చిత్రం



విజ్జేశ్వరం నుంచి వేసే పైపులైన్ మ్యాప్‌ను మంత్రి దుర్గేశ్‌కు వివరిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాస్

వాటర్ గ్రిడ్ పథకానికి పవన్ శంకుస్థాపన !

- ఈ నెల మూడో వారంలో విజ్జేశ్వరం, పెరవలి రాక
- రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్

పెరవలి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి):ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రజలకు స్వచ్ఛ జలాలను అందించే జలజీవన్ మిషన్ వాటర్ గ్రిడ్ పథకానికి ఈ నెల మూడో వారంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ శంకుస్థాపన చేయనున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ పథకం కింద రూ.1400 కోట్లు మంజూరు చేశాయి. విజ్జేశ్వరం బ్యారేజ్ నుంచి గోదావరి నీటిని శుద్ధి చేసి పైపులైన్‌ల ద్వారా ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని అన్ని ప్రాంతాలకు సరఫరా చేస్తారు. పెరవలిలో భారీ భూగర్భ మంచినీటి ట్యాంక్‌ను నిర్మించనున్నారు. ఈ ప్రాంతాన్ని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించాలన్నదే ప్రభుత్వ ధ్యేయమన్నారు. ఇందులో భాగంగా ఉమ్మడి పశ్చిమలోని 854 గ్రామాలకు ఈ పథకం ద్వారా నీటిని సరఫరా చేస్తామన్నారు. విజ్జేశ్వరం, పెరవలిలలో పనులకు పవన్ శంకుస్థాపన చేస్తారని, అనంతరం ఇక్కడ నిర్వహించే భారీ బహిరంగ సభలో మాట్లాడతారని తెలిపారు. పెరవలి, కానూరు, నిడదవోలు, వేలివెన్నులలో భూగర్భ మంచినీటి ట్యాంక్‌లు నిర్మించనున్నట్లు తెలిపారు. ఆర్‌డబ్ల్యూఎస్‌డీఈ శ్రీనివాస్ మాట్లాడుతూ ఐదు లక్షల లీటర్లు పట్టే విధంగా 30 సెంట్ల స్థలంలో ట్యాంకు నిర్మిస్తామన్నారు. ఏఈ బాలమురళీకృష్ణ, పిప్పర రవి, అతికాల శ్రీను, సలాది కృష్ణమూర్తి, బొడ్డు రామాంజనేయులు, తహసీల్దార్ నిరంజన్, ఎంపీడీవో ఉమా రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

ఎత్తుకు పైఎత్తు..

చెస్‌లో ఒకేసారి 30 మందిని ఓడించిన కృష్ణతేజ



చెస్ ఆడుతున్న కృష్ణతేజ

ఏలూరు రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): సాధారణంగా చదరంగం ఒకరితో ఆడి గెలవడమే కష్టం. ఈ ఆటలో ప్రత్యర్థిగా ఉన్న వ్యక్తి ఎప్పుడు ఎలాంటి మూవ్‌లో చెక్ పెట్టేస్తాడన్నది ఊహించడం కష్టమే. అలాంటిది ఏకంగా ఒకే సమయంలో 30 మందితో చెస్ ఆటడం అంటే మామూలు విషయమా.. 30 మందితో ఆడి 30 గేమ్స్‌లో కూడా విజయం సాధించడం అంటే అబ్బురమే. తాడేపల్లిగూడెం చెందిన ఇంటర్నేషనల్ మాస్టర్ ఎన్. కృష్ణతేజ, వట్లూరు సిద్ధార్థ క్వెస్ట్ పాఠశాలలో అనసూయ అకాడమీ సహకారంతో విద్యార్థులకు చదరంగంలో శిక్షణతో పాటు పోటీల్లో ఆయన పాల్గొన్నారు. పోటీలను స్కూల్ ప్రిన్సిపాల్ మహంతి ప్రారంభించారు. ఒకరితో ఆడి గెలిస్తే కిక్ ఏముంటుంది అనుకున్నాడో ఏమో ఒకేసారి 30 మందితో, ఇందులో 15 మంది అంతర్జాతీయ క్రీడాకారులు కూడా ఉండటం విశేషం. అందరితో చేసి ఆడి విజయం సాధించి ఔరా అనిపించాడు.

పంచాయతీ వ్యవస్థ బలోపేతం

- ఉమ్మడి పశ్చిమలో ఏడు డీడీవో కార్యాలయాలు ప్రారంభం
- కార్యాలయంలో డీఎల్‌పీవో, డ్వామా ఏపీడీ ఇతర ఆఫీసులు

(ఏలూరు సిటీ-ఆంధ్రజ్యోతి)



ఏలూరులోని డీడీవో కార్యాలయం

ఉమ్మడి జిల్లాలో పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతం కానుంది. డివిజన్ స్థాయిలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించే శాఖలన్నింటినీ ఒకే పరిపాలన నియంత్రణలోకి తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. డివిజినల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ (డీడీవో) కార్యాలయాలతో సమన్వయం చేసుకుని అభివృద్ధి కార్యక్రమాలను సమర్థంగా అమలు చేసేందుకు ప్రణాళికలను రూపొందించింది. గతంలో ఉన్న బ్లాక్ డెవలప్‌మెంట్ అధికారుల తరహాలో ఇప్పుడు డివిజన్ స్థాయిలో డీడీవో వ్యవస్థను తీసుకువచ్చింది. ఎంపీడీవోలకు పదోన్నతులు కల్పించటంతో నియమితులైన డీడీవో డివిజన్ స్థాయిలో అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించనున్నారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పంచాయతీరాజ్‌లో సంస్కరణలు తీసుకురావటంతో డీడీవోలకు విశేష అధికారాలు సంక్రమించాయి. డివిజినల్‌స్థాయిలో ఉన్న డివిజినల్ పంచాయతీ కార్యాలయం (డీఎల్‌పీఓ), డ్వామా అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ (డ్వామా ఏపీడీ) ఇతర శాఖలకు సం బంధించిన డివిజినల్ కార్యాలయాలను డీడీవో కార్యాలయాల సముదాయంలోకి మార్చాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతానికి నాంది పలికింది. డీడీవో కార్యాలయాల ఏర్పాటుతో పంచాయతీ పాలన వేగవంతం అవుతుంది. ఇంత వరకు పోలీస్, రెవెన్యూ శాఖలకు డివిజినల్‌స్థాయిలో కార్యాలయాలు ఉన్నాయి. ఇకపై పంచాయతీరాజ్ వ్యవస్థలో డివిజినల్ కార్యాలయాలు ఏర్పాటయ్యాయి. పూర్తిస్థాయిలో ఈ పాలన విస్తరిస్తే గ్రామాలు మరింత అభివృద్ధి చెందటంతోపాటు పాలనా వికేంద్రీకరణ జరిగే అవకాశాలున్నాయి.

ఉమ్మడి జిల్లాలో 7 కార్యాలయాలు

ఉమ్మడి జిల్లాలో ఏలూరు, జంగారెడ్డిగూడెం, నూజివీడు, భీమవరం, నరసాపురం, తాడేపల్లిగూడెం, కొవ్వూరులలో ఏడు డీడీవో కార్యాలయాలు ఏర్పాటయ్యాయి. వీటి ఏర్పాటుకు జడ్పీ నిధులు కేటాయించారు. గురువారం నుంచి తమ కార్యకలాపాలు ప్రారంభించాయి.

పాలనలో నూతన సంస్కరణలు..

పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక(జీపీడీపీ) లను డీడీవోలు రూపొందించి అమలు చేస్తాయి. ఆర్థిక వనరులను సమకూర్చుకునేందుకు పంచాయతీలో పన్నులు, ఫీజుల వసూళ్లపై దృష్టి సారిస్తారు. 16 రకాల అధికారాలను గ్రామ పంచాయతీలపై డీడీవోలు కలిగి ఉంటారు. పంచాయతీల్లో ఉపాధి పనుల పర్యవేక్షణ, సోషల్ ఆడిట్ సిబ్బందితో గ్రామాల్లో తనిఖీలు నిర్వహించటంతోపాటు స్వయం సహాయక సంఘాల ద్వారా స్వయం ఉపాధి కోసం సహకారం అందిస్తారు.

డీడీవోలకు విధులు..

డీడీవో డివిజన్ స్థాయిలో అన్ని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి విభాగాలపై నియంత్రణ బాధ్యతలు నిర్వహిస్తారు. జిల్లా కలెక్టర్ నియంత్రణలో ఉంటూ డివిజన్ స్థాయిలో ఆయా శాఖల అనుసంధానంతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఇప్పటి వరకు స్థానిక సంస్థల ఎన్నికలకు డిప్యూటీ డిస్ట్రిక్ట్ ఎన్నికల అథారిటీగా ఆర్డీఓలు ఉండేవారు. ఇక నుంచి డీడీవోలకు ఆ బాధ్యతలు అప్పగిస్తూ పంచాయతీరాజ్ రూల్స్‌ను సవరిస్తారు.

పాలన సులభతరం

-కె భీమేశ్వర్, జడ్పీ ఇన్‌చార్జి సీఈఓ



డీడీవో కార్యాలయాలు ఏర్పాటుతో పంచాయతీల పాలన సులభమవుతుంది. డివిజన్ స్థాయి మానిట రింగ్ వ్యవస్థ ఏర్పడింది. పంచాయతీల పాలనతో పాటు, మండల పరిషత్‌లో జరిగే కార్యకలాపాలపై డీడీవోల పర్యవేక్షణ ఉంటుంది. పంచాయతీరాజ్ వ్యవస్థకు డివిజనల్ స్థాయిలో కార్యాలయాలు ఏర్పాటు కావటంతో పంచాయతీ పాలన వేగవంతమ వుతుంది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 7 డీడీవో కార్యాలయాలను జడ్పీ నిధులతో నిర్మించటం జరిగింది. ఈ కార్యాలయాలలో పాలన వేగవంతమైతే పంచాయతీలలో సుస్థిర అభివృద్ధికి సాధ్యమవుతుంది.



విద్యార్థులకు బహుమతులు అందించిన దృశ్యం



ఉండి కేవీకేలో మాట్లాడుతున్న డాక్టర్ డిబోరా మెషియానా

నేలలను పరిరక్షించుకోవాలి

పెనుమంట్ర, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మార్టేరులోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, వ్యవసాయ పాలిటెక్నిక్‌లో ప్రపంచ మృత్తిక దినోత్సవాన్ని నిర్వహించారు. మార్టేరు వ్యవసాయ పాలిటెక్నిక్ విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఇన్‌చార్జి ఎ.డి.ఆర్. డాక్టర్ బి. సహదేవ రెడ్డి అధ్యక్షత వహించి నేలలను పరిరక్షించుకోవలసిన ఆవశ్యకతను వివరించారు. విచక్షణా రహితంగా ఎరువులు, ఇతర రసాయనాల వినియోగం వల్ల నేల, నీరు కలుషితమవుతుందని, వీటిని తగ్గించే దిశగా రైతులను సమాయత్తం చేయవలసిన ఆవశ్యకత శాస్త్రవేత్తలపై ఉన్నదన్నారు. ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సీహెచ్ శ్రీనివాసరావు, డాక్టర్ ఎన్.శ్రీనివాసరావు, పాల్గొన్నారు. అనంతరం నెగ్గిపూడిలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు.

ఉండి: నేలలు ఆరోగ్యంగా ఉంటేనే పంటలు బాగా పండుతాయని ఉండి కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ మల్లికార్జునరావు అన్నారు. శుక్రవారం ఉండి కేవీకేలో ఆయన మాట్లాడారు. నేలల సంరక్షణ, పచ్చదనం, ఆరోగ్యకరమైన జీవనానికి అంద రూ ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. నగరాల్లో పారిశ్రామికీకరణ, వాహనాలు, ఇళ్లలో వాడే శీతలీకరణ పరికరాలు కారణంగా వాయు, నీటి కాలుష్యంతో పాటు నేల కూడా కాలుష్యం అవుతుందన్నారు. నగరాల్లో మొక్కలను ఎక్కువగా పెంచి కాలుష్యాన్ని తగ్గించి నేలను సంరక్షించాలని కోరారు. చిట్టవరం, నవరసపురంల నుంచి రైతులు విచ్చేశారు. ఉండి కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ డిబోరా మెషియానా, డాక్టర్ ఎ.శ్రీనివాసరావు, డాక్టర్ బిందు ప్రవీణ, డాక్టర్ వినయలక్ష్మి పాల్గొన్నారు.



రైట్ రైట్ బస్సును ప్రారంభించి నడుపుతున్న ఎమ్మెల్యే ప్రభాకర్

విద్యార్థుల బస్సు కష్టాలకు చెక్

పెదవేగి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి):విద్యార్థుల కల నెరవేరింది. ఇకపై ఎటువంటి ఇబ్బందులు లేకుండా విద్యాలయాలకు చేరుకునే వెసులుబాటు కలిగింది. దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ చొరవతో విద్యార్థులను కలెక్టర్ దగ్గరకు తీసుకెళ్లి వారి సమస్యకు పరిష్కారం చూపారు. రామశింగవరం, కూచింపూడి, పెదవేగి, లక్ష్మీపురం గ్రామాల విద్యార్థులు ఉదయం కళాశాలలకు వెళ్లే సమయంలో బస్సు ఖాళీ లేక ఇబ్బందులు పడుతుండడంతో గురువారం వారు కూచింపూడిలో బస్సును ఆపి నిరసన తెలిపారు. ఎమ్మెల్యే విద్యార్థులతో కలిసి కలెక్టర్ కె.వెట్రిసెల్విని కలిసి సమస్య వివరించారు. ఆమె శుక్రవారం నుంచి బస్సు నడిచేలా చర్యలు తీసుకున్నారు. ఎమ్మెల్యే ప్రభాకర్ శుక్రవారం ఉదయం రామ శింగవరంలో బస్సును ప్రారంభించారు. అనంతరం విద్యార్థులను బస్సులో ఎక్కించుకుని పెదవేగి వరకు ఆయనే స్వయంగా బస్సును నడిపారు. ఎమ్మెల్యేకు విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

చర్లపల్లి నుంచి నర్సాపురానికి ప్రత్యేక రైలు

ఏలూరు క్రైం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి):ప్రయాణీకుల రద్దీ దృష్ట్యా ఒక ప్రత్యేక రైలు(ఒకవైపు)ను నడపడానికి దక్షిణ మధ్య రైల్వే శాఖ అధికారలు చర్యలు తీసుకున్నారు. రైల్ నంబర్ 07140 చర్లపల్లి నుంచి నరసాపూర్‌కు ఈ నెల 26న ఈ ప్రత్యేక రైలును నడపనున్నారు. చర్లపల్లిలో రాత్రి 10.40 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 9.45 గంటలకు నర్సాపురం రైల్వే స్టేషన్‌కు చేరుకుంటుంది. ఈ రైలు నల్గొండ, మిర్యాలగూడ, నడికుడి, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ, గుడివాడ, కైకలూరు, ఆకివీడు, భీమవరం, పాలకొల్లు స్టేషన్లలో ఆగుతుంది. ఫస్ట్ క్లాస్ ఏసీ, సెకండ్ క్లాస్ ఏసీ, త్రీ టైర్ ఏసీ, స్లీపర్ అండ్ జనరల్ సెకండ్ క్లాస్ కోచ్‌లు ఉంటాయి.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

ద్వారకాతిరుమల, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి):తిమ్మాపురం, తిరుమలంపాలెం, పావులూరివారిగూడెంలలో ఎరువుల దుకాణాలను ఏడీఏ పీజీ బుజ్జిబాబు శుక్రవారం తనిఖీలు చేశారు. దుకాణాలల్లో ఈ పాస్ నిల్వలు, ఎరువుల ఓ ఫారంలను పరిశీలించారు. పావులూరివారిగూడెం గోద్రెజ్ అగ్రో విత్ మాటూరి పంచాక్షరీ వారు సరఫరా చేసిన సల్ఫర్ ఎరువుకు సంబంధించి ఓ ఫారంను లైసెన్స్‌లో జత పరచని కారణంగా రూ.12 లక్షల విలువైన 19 టన్నుల స్టాక్ అమ్మకాలను నిలిపివేశారు.



ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు

నరసాపురం రూరల్ : పట్టణ, మండలంలోని పలు ఎరువుల దుకాణాలతో పాటు సొసైటీ గోదాములను శుక్రవారం వ్యవసాయశాఖ అధికారులు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఆ శాఖ ఏడీఏ ప్రసాద్ జీవన్, ఏవో జ్యోషిలా రికార్డులు, స్టాక్ వివరాలు, నిల్వలు, నోటీస్ బోర్డులను పరిశీలించారు. మొత్తం 17 దుకాణాల్లో తనిఖీలు చేశారు. నిబంధనలకు అనుగుణంగా ఎరువులు, పురుగుల మందులు విక్రయించకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మెప్మాలో అవకతవకలంటూ బాధితుల ఆగ్రహం

ఆకివీడు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పేదరిక నిర్మూలన కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన మెప్మా గ్రూప్‌లో అవకతవకలు జరిగాయి. స్థానిక వాసవి గ్రూప్‌లో ఈ ఏడాది మార్చి నెలలో లీడర్లు, సభ్యులకు సంబంధించి రూ.5లక్షలు క్యాష్ క్రెడిట్ లోన్ పొదుపు కింద డబ్బులు పడ్డాయి. గ్రూప్‌లో ముగ్గురు లీడర్లు, ఏడుగురు సభ్యులు ఉన్నారు. బ్యాంకులో పడి తొమ్మిది నెలలు కావస్తుంది, ఇంత వరకు యానిమేటర్ గ్రూప్ లీడర్లు, సభ్యులకు విషయం తెలియపర్చలేదు. వడ్డీ నెలకు రూ.4,500 చెల్లించాల్సి ఉండడంతో అసలు, వడ్డీ కలిపి దాదాపుగా రూ.లక్ష నష్టం వాటిల్లుతుందని లీడర్లు,సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యానిమేటర్‌కు లీడర్లు, సభ్యులు ఫోన్ చేస్తుంటే అందుబాటులోకి రావడంలేదంటున్నారు. ఇవే కాకుండా అనేక అవకతవకలు జరిగాయని బాధితులు ఆగ్రహిస్తున్నారు. బ్యాంకు మేనేజర్‌ను బాధితులు ప్రశ్నించగా సోమవారం క్లారిటీ ఇస్తామని తెలిపారన్నారు. అవకతవకలపై మెప్మా సీవో జయకృష్ణను ప్రశ్నించగా తమకు ఎవరూ ఫిర్యాదు చేయలేదని, సమాచారం తెలిసిందన్నారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతానని తెలిపారు. మరికొన్ని గ్రూపుల్లో కూడా అవకతవకలు జరిగినట్టు తెలుస్తోంది.

విధులకు ఆటంకం కలిగించడంపై కేసు

పెదపాడు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఒక ఉపాధ్యాయురాలు తన విధులకు ఆటంకం కలిగించారంటూ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో నిందితుడిపై పెదపాడు పోలీసులు కేసు నమోదు చేశారు. గత అక్టోబరు 30వ తేదీన ఎంపీపీ స్కూల్ పక్కన వున్న చర్చిలో ఇంజమూల మరియదాస్ తల్లి మరణించడంతో భోజనాలు ఏర్పాటు చేశారు. ఆ సమయంలో ఇంజమూల కిరణ్ పాఠశాలకు వచ్చి విద్యార్థులను భోజనాలకు పంపమని ఉపాధ్యాయురాలు స్వప్నను అడిగారు. పిల్లల తల్లిదండ్రుల అనుమతితో పంపిస్తానని, అలాగే ఆ సమయానికి పిల్లల మధ్యాహ్న భోజనం కూడా పూర్తయినట్లుగా తెలిపారు. దీంతో ఇంజమూల కిరణ్ ఉపాధ్యాయురాలి మాటలు వినకుండా గొడవ చేసి విధులకు ఆటంకం కలిగించినట్లుగా పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. పెదపాడు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్ వ్యర్థాల వాహనం పట్టివేత

పెదపాడు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): చేపల చెరువుల్లో మేతగా వేసేందుకు చికెన్ వ్యర్థాలను తరలిస్తుండగా పెదపాడు మండలం సత్యవోలు గ్రామ పరిసరాల్లో తనిఖీలు నిర్వహించి వడ్డిగూడెం రోడ్డులో ఒక ఐషర్ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లుగా పెదపాడు ఎస్సై కట్టా శారదా సతీష్ తెలిపారు. చికెన్ వేస్ట్‌ను, వాహనాన్ని స్వాధీనం చేసుకుని, వాహన యజమాని, డ్రైవర్లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హత్యకు దారితీసిన వివాహేతర సంబంధం




హత్య కేసులో నిందితులను అరెస్టు చేసి వివరాలు తెలుపుతున్న డీఎస్పీ శ్రావణ్‌కుమార్

భీమడోలు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఒక మహిళతో ఇరువురు వివాహేతర సంబంధం కారణంగా పూళ్లలో ఒక వ్యక్తి హత్యకు దారి తీసిందని ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ తెలిపారు. ఈనెల 2వ తేదీన పూళ్ల సంతమార్కెట్‌లో పట్టపగలు జరిగిన దారుణ హత్యకు సంబంధించి నలుగురు వ్యక్తుల్ని భీమడోలు పోలీసులు అరెస్టు చేశారు. డీఎస్పీ శ్రావణ్‌కుమార్ భీమడోలు సర్కిల్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో హత్యకు దారి తీసిన వివరాలను వెల్లడించారు. పూళ్ళ పడమట దళితపేటకు చెందిన మృతుడు పాతల నాగరాజు (48) కాండ్రు ఇస్సాకు వీరిరువురికీ ఒకే మహిళతో వివాహేతర సంబంధం ఉండేదని దీనిపై పాత గొడవలు కోర్టు కేసులు కూడా ఉన్నాయని తెలిపారు. దీనిపై ఏవన్ నిందితుడు కాండ్రు ఇస్సాకు ఎలాగైనా పాత నాగరాజు అడ్డు తొలగించు కోవాలని భావించి కుటుంబ సభ్యులైన కాండ్రు నాగతేజ, అద్దంకి బాబి, స్నేహితుడైన కాలి రాజేష్‌లతో పథకం ప్రకారం తమ వెంట తెచ్చుకున్న కత్తులతో పాత నాగరాజుపై దాడి చేసి హత్య చేశారు. అనంతరం పరారయ్యారు. కేసును దర్యాప్తు చేపట్టి భీమడోలు సీఐ యుజె విల్సన్, ఎస్ఐ మదీనా బాషా సిబ్బందితో పూళ్ళ శివారు పోలిమేర పుంత కురెళ్ళగూడెం శ్మశాన వాటిక సమీపంలో అరెస్టు చేసినట్లు తెలిపారు.

నిందితులను అరెస్టు చేస్తాం : డీఎస్పీ

ఏలూరు క్రైం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): యువతిపై అత్యాచారానికి పాల్పడిన రౌడీ షీటర్‌తో పాటు అతనికి సహకరించిన వారిని అరెస్టు చేసి చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ చెప్పారు. డీఎస్పీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ డి శ్రావణ్‌కుమార్, టూటౌన్ సీఐ అశోక్‌కుమార్ మాట్లాడారు. ఏలూరుకు చెందిన ఉలిగడ్డ జగదీష్‌బాబుపై సస్పెక్ట్ షీటు ఉందని అతనిపై 10 కేసులు ఉన్నాయని మంగళగిరిలో ఉంటూ ఒక ప్రైవేటు ట్రావెల్ బస్సును నడుపుతున్నాడని ఈనెల 2వ తేదీన ఒక చోరీ కేసులో తాడేపల్లిగూడెం కోర్టుకు హాజరై తిరిగి ఏలూరు వచ్చాడన్నారు. అతనికి ఏలూరుకు చెందిన ఓ మహిళతో పాటు, ఆమె కుమార్తెతో వివాహేతర సంబంధం ఉందన్నారు. ఆ మహిళ నేరస్తులకు సహకరిస్తూ చోరీ చేసిన సొత్తును దాచి వారికి సహకరిస్తుందన్నారు. జగదీష్‌బాబు ఆమె వద్దకు 2వ తేదీ రాత్రి లావేటి భవానీ కుమార్‌తో కలిసి వెళ్లాడన్నారు. ఆ సమయంలో ఇంట్లో ఆ మహిళ కుమార్తె, ఆమె స్నేహితురాలైన ఎన్టీఆర్ జిల్లాకు చెందిన ఓ యువతి ఉన్నారన్నారు. అర్ధరాత్రి కుమార్తె స్నేహితురాలైన యువతిని జగదీష్ కొట్టి సమీప ప్రాంతానికి తీసుకువెళ్లి అత్యాచారం చేశాడని తెలిపారు. ఈ కేసులో నిందితులను అరెస్టు చేయడానికి చర్యలు చేపట్టామన్నారు.

విద్యుదాఘాతంతో బాలుడికి గాయాలు



ఆకివీడు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వే క్వార్టర్స్ సమీపంలో శుక్రవారం పిల్లలు క్రికెట్ ఆడుతు న్నారు. క్రికెట్ ఆడుతుండగా బాల్ వెళ్ళి ట్రాన్స్‌ఫార్మర్ అవతల కౌంపౌండు వాల్ దగ్గర పడింది. బాల్ కోసం నమ్మి దేవహర్ష గోడ దూకి క్రికెట్ బాల్ తీసుకొని మరలా గోడ దూకి తీసుకొస్తుండగా ట్రాన్స్‌ఫార్మర్ పట్టుకోవడంతో షాక్ కొట్టింది. ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. దేవహర్ష స్థానిక జిల్లా పరిషత్ బాలురు ఉన్నత పాఠశాలలో ఐదవ తరగతి చదువుతున్నాడు.

మోటారు సైకిల్ చోరీ

పెదపాడు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : తన ఇంటి ముందు తాళం వేసి వున్న ఏపీ 40 ఎఫ్‌హెచ్ 1600 నెంబరు గల సుజికి యాక్సిస్ 125 వాహనాన్ని గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసినట్టు పెదపాడు మండలం కొత్తూరు గ్రామానికి చెందిన నల్లగొండ చంద్రమ్మ పెదపాడు పోలీసులకు ఫిర్యాదు చేసింది. నవంబరు 27వ తేదీన ఘటన జరిగినట్లుగా, చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పెదపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



తణుకు ఉండ్రాజవరం జంక్షన్‌లో బోల్తా పడిన లారీ.. భీమవరం పెద్ద వంతెనపై అదుపు తప్పి డీవైడర్ ఎక్కిన కారు

అదుపు తప్పిన వాహనాలు

గోతుల్లో పడి లారీ బోల్తా..

తణుకు రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి):నిత్యం జన సంచారంతో రద్దీగా వుండే తణుకు ఉండ్రాజవరం జంక్షన్‌లో శుక్రవారం బారీలోడుతో వెళ్తున్న ఐషర్ వ్యాన్ బోల్తా పడింది. ఈ సమయంలో ఈరోడ్డులో జన సంచారం తక్కువగా వుండటంతో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగపోవడంతో పాటు వాహనం నడిపే డ్రైవర్ కూడా తప్పించుకోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. తణుకు ఉండ్రాజవరం జాతీయ రహదారిపై వంతెన ఫ్లైవోవర్ నిర్మాణం పనులు మధ్యలోనే నిలిచిపోవడంతో కొద్దిపాటి వర్షానికే ఇక్కడ రోడ్లు గోతులు పడి ప్రమాదకరంగా వుంటున్నాయి. ఈక్రమంలో శుక్రవారం తాడేపల్లిగూడెం నుంచి రావులపాలెం వెళ్తున్న పాత అట్టల లోడ్ ఐషర్ వ్యాన్ బోల్తా పడింది.

భీమవరంలో డీవైడర్ ఎక్కిన కారు

భీమవరం క్రైం: భీమవరం పట్టణంలోని పెద్ద వంతెనపై శుక్రవారం మధ్యాహ్నం ఒక కారు అదుపు తప్పింది. వేగంగా వెళ్తున్న కారు ముందు వెళ్తున్న ఆటోను తప్పించబోయి ఒక్కసారిగా ఎడమ పక్కకు వెళ్ళడంతో కారు డివైడర్ ఎక్కింది. దీంతో టైరు పేలిపోవడంతో అక్కడ ఉన్నవారంతా భయబ్రాంతులకు గురయ్యారు. కారులో ఉన్నవారికి స్వల్ప గాయాలయ్యాయి. సుమారు గంటసేపు ట్రాఫిక్ ఆగిపోవడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మొత్తం మీద ట్రాఫిక్ పోలీసులు అక్కడకు చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

మనస్తాపంతో ఆత్మహత్యాయత్నం

దెందులూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : దెందులూరు మండలం శ్రీరామవరం గ్రామానికి చెందిన వరి దుర్గారావు(43) శుక్రవారం పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం చోళ్ళ మండలి బ్యాంక్ అనే ఫైనాన్స్ సంస్థలో దెందులూరు గ్రామానికి చెందిన కానిస్టేబుల్ ఏడుకొండలు అనే వ్యక్తి వరి దుర్గారావుకు మధ్యవర్తిగా ఉండి అప్పుగా రూ.3 లక్షలు ఇప్పించి తాను మరో మూడు లక్షలు తీసుకుని రూ.6 లక్షలు దుర్గారావే తీసుకునట్లు బ్యాంక్‌కు పత్రాలు ఇచ్చారు. ఏడుకొండలు ఊరు వదిలి వెళ్లిపోవడం వలన ఫైనాన్స్ సంస్థ శ్రీరామవరంలోని దుర్గారావు ఇంటిని స్వాధీనం చేసుకుని ఇల్లు ఖాళీ చేయించింది. దీనితో మనస్తాపానికి గురైన దుర్గారావు ఇంట్లో పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడని కుటుంబ సభ్యులు తెలిపారు. గమనించిన కుటుంబ సభ్యులు ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. కేసు నమోదు చేసిన అవుట్ పోస్టు పోలీసులు దెందులూరు పోలీసులకు సమాచారం అందించారు.

అంగన్‌వాడీ టీచర్ మృతి

చింతలపూడి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : చింతలపూడి నగర పంచాయతీ సుప్రియన్‌పేట అంగన్‌వాడీ సెంటర్‌లో టీచర్‌గా పని చేస్తున్న కందిపాం వరలక్ష్మీ(61) విధి నిర్వహణలో గుండె పోటు రావడంతో ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరీక్ష చేసిన వైద్యులు అప్పటికే ఆమె మృతి చెందినట్టు నిర్ధారించారు. ఆమెకు భర్త, పిల్లలు ఎవరూ లేరు. మేనల్లుడి వద్దే ఉంటుంది. ఆమె కుటుంబాన్ని సీఐటీయూ, సీపీఎం నాయకులు ఆర్.వి.సత్యనారాయణ, నత్తా వెంకటేశ్వరరావు పరామర్శించి సంతాపం తెలిపారు.

ముగ్గురిపై కేసు నమోదు

ఏలూరు క్రైం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఓ కోచింగ్ సెంటర్‌కు వచ్చే ఆడ పిల్లలు పడే విధంగా సీసీ కెమెరాలు పెట్టి ఇమేజ్‌లు క్యాప్చర్ చేస్తున్న ముగ్గురిపై కేసు నమోదు చేశారు. ఏలూరు ఆర్ఆర్‌పేలోని రంగూన్‌మేడ వీధిలో న్యాయవాది రత్నరాజు ఉంటున్నారు. ఆయన ఓ కోచింగ్ సెంటర్‌ను కూడా అక్కడే నడుపుతున్నారు. రత్నరాజు పక్కింటి వారితో పాత గొడవలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో కోచింగ్ సెంటర్‌కు వచ్చే ఆడపిల్లలు పడే విధంగా వాళ్ళ పక్కకు కనబడేలా సీసీ కె మెరాలను ఏర్పాటు చేసి ఇమేజ్‌లను కూడా క్యాప్చర్ చేశారు. కులం పేరుతో ఆయన్ను దూషించారు. అప్పటి నుంచి అలా వేధింపు లకు పాల్పడుతున్నారు. చివరకు బాధితుడు పోలీసులను ఆశ్రయించడంతో ఈ చర్యలకు పాల్పడిన దువ్విరెడ్డి జయహరిక, ఘంటా భాను కిరణ్, ఘంటా రామ్మోహన్‌లపై శుక్ర వారం ఏలూరు టూటౌన్ పోలీసులు ఐటీ యాక్టుతో పాటు, ఎస్సీ ఎస్టీ సెక్షన్‌లపై కేసు నమోదు చేశారు.

కల్వర్టుపై పడి యువకుడి మృతి

కామవరపుకోట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. తడికలపూడి పోలీసుల కథనం ప్రకారం కామవరపుకోట మండంలోని రామన్నపాలెంకు చెందిన మిరియాల వంశీ(26) గురువారం రాత్రి ద్విచక్రవాహనంపై కామవరపుకోటకు బయలుదేరాడు. మద్దిపాటివారిగూడెం వచ్చేసరికి ద్విచక్రవాహనం అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొని కల్వర్టుపైపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతి చెందిన వంశీ సోదరి గొన్నూరు సదా ఫిర్యాదు మేరకు తడికలపూడి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

12వ రోజుకు ఆర్టీసీ కార్మిక సంఘాల దీక్షలు

ఏలూరుకార్పొరేషన్, డిసెంబరు5(ఆంధ్రజ్యోతి):ఆర్టీసీ కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఆర్టీసీ గ్యారేజి వద్ద కార్మికులకు ఉద్యోగుల అక్రమ సస్పెన్షన్లను రద్దు చేయాలని కోరుతూ కొన సాగిస్తున్న రిలే నిరాహార దీక్షలు శుక్రవారం 12వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో కార్మిక సంఘాల నాయకులు ఎస్.ఎల్.రావు, ఆర్.ఎస్.కృష్ణ, పి.పరమయ్య, ఎస్.నాగేంద్ర, డి.బుజ్జిబాబు, టి.ఎస్.కిరణ్‌బాబు, జి.తేజ, డి.శ్రీరాములు, పి.వి.రమణ పాల్గొన్నారు. పెట్రోలు బంకులో జరిగిన అవినీతితో ఉద్యోగులకు సంబంధంలేదని, అక్రమ సస్పెన్షన్లను ఎత్తివేయాలని నినాదాలు చేశారు.

నేలల రక్షణపై అవగాహన ర్యాలీ

లింగపాలెం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రపంచ నేలల దినోత్సవాన్ని పురస్కరించుకుని కొత్తపల్లి గ్రామంలో ఏవో వి.ప్రదీప్ కుమార్ ఆధ్వర్యంలో 'నేలల రక్షణపై అవగాహన ర్యాలీ' నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ పరిమితికి మించిన ఎరువుల వినియోగంతో నేలలు దెబ్బతింటాయన్నారు. రైతులు సేంద్రియ ఎరువులను వినియోగించాలని, సేంద్రియ పద్ధతిలో పంటల సాగును చేపట్టాలని సూచించారు. భూసారం తగ్గితే ఎన్ని ఎరువులు వాడినా పంటల దిగుబడి పెరగదని తెలిపారు. వ్యవసాయాధికారులు, రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల ఆక్రమణలను సహించం

▸ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఆగ్రహం

పెదవేగి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూముల ఆక్రమణలను సహించబోమని, అక్రమార్కుల అండతో ప్రభుత్వభూములను ఆక్రమించాలని చూస్తే కఠినచర్యలు తప్పవని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. పెదవేగిలో పీహెచ్‌సీకి చెందిన భూమిని పెదవేగికి చెందిన కొంతమంది వ్యక్తులు ఆక్రమించుకుని సాగు చేస్తున్నారు. దీనిపై వచ్చిన ఫిర్యాదుతో స్పందించిన ఎమ్మెల్యే శుక్రవారం ఉదయం పీహెచ్‌సీని సందర్శించి, ఆక్రమణకు గురైన పీహెచ్‌సీ భూమిని పరిశీలించి, మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ హయాంలో అడ్డగోలు రాజ్యాంగం నడిచిందని విమర్శించారు. పెదవేగి పీహెచ్‌సీకి సంబంధించిన భూమిని స్వాధీనం చేసుకోవాలని చూశారని, కానీ అలాంటివాటిని చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. దాత ఇచ్చిన భూమి వారి వారసులు లాక్కోవాలని చూడడం హేయమైన చర్య అన్నారు. పెదవేగి సొసైటీ అధ్యక్షుడు తాతా సత్యనారాయణ, పెదవేగి, లక్ష్మీపురం, రామశింగవరం గ్రామ సర్పంచ్‌లు తాతా శ్రీరామ్మూర్తి, మేకా కనకరాజు, అడపా శ్రీనివాసరావు, పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ మాధవి, పార్టీనాయకులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం : పత్సమట్ల

భీమడోలు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ప్రజల సమస్యలు పరిష్కరించి సంక్షేమ ఫలాలను వారికి అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. భీమడోలు గ్రామ పంచాయతీ ఆవరణలో శుక్రవారం జరిగిన జనవాణి, ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. గ్రామంలోని సమస్య లపై ప్రజల నుంచి వినతులను అందుకుని పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఏఎంసీ చైర్మన్ శేషపు గిరి, కరణం పెద్దిరాజు, కుక్కల ప్రసాద్, తహసీల్దార్ రమాదేవి, ఎంపీడీవో పద్మావతి, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

కొబ్బరికి గిట్టుబాటు ధర కల్పించాలి : శ్రీనివాస్

పెదవేగి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి):ఆటుపోటుల మధ్య కొబ్బరి రైతులు కుదేల వుతున్నారని, కొబ్బరికి గిట్టుబాటుధర కల్పించి, రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఏపీ కొబ్బరి రైతుల సంఘం రాష్ట్ర కన్వీనర్ కె.శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విజయరాయిలో కొబ్బరి రైతుల సంఘం సమావేశం శుక్రవారం జరిగింది. సమావేశంలో కొబ్బరిధర పతనం, రైతులు ఎదుర్కొంటున్న నష్టాలపై చర్చించారు. అనంతరం గిట్టుబాటు ధర కల్పించాలని కోరుతూ నినాదాలు చేస్తూ ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొబ్బరి కాయల ధర గణనీయంగా తగ్గిపోయిందని, వెయ్యి కాయల ధర రూ.26వేలనుంచి రూ.15వేల దిగువకు పడిపోవడంతో కొబ్బరి రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. వెయ్యి కాయలకు కనీస ధర రూ.20వేలు కల్పించాలని, అప్పుడే కొబ్బరి రైతు మనుగడ సాధ్యపడుతుందని డిమాండ్ చేశారు. విజయరాయి ప్రాంతీయ కొబ్బరి రైతుల సంఘం ఉపాధ్యక్షుడు మున్నంగి సుబ్బారెడ్డి, కార్యదర్శి బొల్లు రామకృష్ణ, రైతులు కోనేరు సతీష్‌బాబు, గుడిబండి వీరారెడ్డి, కొండా విజయప్రసాద్, ఆలపాటి వాసు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రమేష్, తపన చౌదరి, విక్రమ్ కిశోర్

వాజపేయి శత జయంత్యుత్సవాలు ఘనంగా నిర్వహిద్దాం

ఏలూరు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజపేయి శత జయంత్యుత్సవాలను ఈ ఏడాది ఘనంగా నిర్వహిద్దామని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోజు రమేష్ వెల్లడించారు. ఏలూరు జిల్లా బీజేపీ కార్యాలయంలో శుక్రవారం బీజేపీ జిల్లా సమావేశం అధ్యక్షుడు చౌటపల్లి విక్రమ్ కిశోర్ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా రమేష్ మాట్లాడుతూ ఈనెల 25న వాజపేయి జయంతి సందర్భంగా ప్రతీ జిల్లా కేంద్రంలో వాజపేయి విగ్రహాలను ఏర్పాటు చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. దానికి తగ్గట్టుగా చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గారపాటి సీతారామాంజనేయ చౌదరి, బొల్లిన నిర్మల కిశోర్, వాజపేయి శతజయంతి ఉత్స వాల గోదావరి జోనల్ కన్వీనర్ కోడూరి లక్ష్మీనారాయణ, నాయకురాలు శరణాల మాలతీరాణి, పార్లమెంట్ కన్వీనర్ కట్నేని కృష్ణప్రసాద్, చక్రవర్తి వర్మ, కొరళ్ల సుధాకర్ కృష్ణ, బొరగం వెంకటలక్ష్మి, జిల్లా ప్రధాన కార్యదర్శి గాది రాంబాబు, సత్యనారాయణ పాల్గొన్నారు.

మాలధారులకు ఉచిత భిక్ష ప్రారంభం



భిక్ష వడ్డిస్తున్న స్వాములు

ఏలూరు రూరల్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి) : మాలధారులందరికీ భిక్ష ఏర్పాటు చేశామని గురుస్వామి తడికిమల్ల ప్రసాద్ తెలిపారు. శనివారపుపేట, బాలుర వసతి గృహం ఎదురుగా ఉన్న రామాలయంలో శుక్రవారం స్వాములకు భిక్ష ప్రారంభించారు. ప్రతీ రోజు ఉదయం 11:30 గంటల నుంచి భిక్ష అందిస్తామని, జనవరి 5వ తేదీ వరకు కొనసాగిస్తామన్నారు. అధిక సంఖ్యలో మాలధారులు భిక్ష స్వీకరించారు. అయ్యప్ప, భవాని, వేంకటేశ్వరస్వామి, శివ మాలధారులందరికీ భోజన వసతిని స్వాములు కరుణాకటాక్షాలతో కొనసాగిస్తున్నట్లు చెప్పారు.

అర్హులందరికీ జాబ్ కార్డులు అందిస్తాం : మణికుమార్

బుట్టాయగూడెం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ జాతీయ ఉపాధి హామీ పథకంలో జాబ్‌కార్డులు మంజూరు చేస్తామని ఏపీ ట్రైకార్ ఎం.డి. సీఏ మణి కుమార్ తెలిపారు. శుక్రవారం పండుగూడెంలో జరిగిన కార్యక్రమంలో నూతనంగా మంజూరు కాబడిన 23 మంది వేతనదారులకు జాబ్‌కార్డులను అందజేశారు. అదనంగా మరో వంద రోజుల ఉపాధి పనులు దొరుకుతాయని తెలిపారు. ఎంపీడీవో కె.జ్యోతి, ఇంప్లిమెంటేషన్ ఆఫీసర్ ఎన్.కిరణ్‌కుమార్, ఐటీడీఏ మేనేజర్ ప్రకాష్, సర్పంచ్ విజయలక్ష్మి, కార్యదర్శి సత్యన్నారాయణ, ఎస్ఆర్ఈజీఎస్ అధికారి అలీ సిబ్బంది పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు ప్రోత్సాహకాలు

పోలవరం, డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): పోలవరం మండలంలో పదో తరగతి పరీక్షలలో అత్యధిక మార్కులు సాధించిన దాక్షారపు మన్విత, పెద్దింటి వర్షిణిలకు పోలవరం మండల టీడీపీ అధ్యక్షుడు మంగిన కొండ, జనసేన నాయకుడు కొణతాల ప్రసాద్ చేతుల మీద ప్రోత్సాహక మొమెంటోలు అందజేశారు. ఈ సందర్భంగా పోలవరం అభయాంజనేయస్వామి ఆలయ ఆవరణలో నిర్వహించిన డూప్ సినీ హీరోల డ్యాన్సు ప్రోగ్రాం చూపరులను ఆకట్టుకుంది.

తొమ్మిది మంది జూదరుల అరెస్ట్

జంగారెడ్డిగూడెం,డిసెంబరు5 (ఆంధ్రజ్యోతి) : స్థానిక మార్కెట్ యార్డు వద్ద పేకాట స్థావరంపై పోలీసులు శుక్రవారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో తొమ్మిదిమంది జూదరులను అదుపులోకి తీసుకుని వారినుంచి రూ.25,150 నగదు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ ఎన్.వీర ప్రసాద్ తెలిపారు. అదేవిధంగా నూజివీడు నుంచి కొయ్యలగూడెం మండలం సీతంపేటకు అనుమతులు లేకుండా రవాణా చేస్తున్న రెండు కలప లారీలను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ తెలిపారుప. తదుపరి విచారణ కోసం స్థానిక అటవీ శాఖ అధికారులకు కలప లోడుతో ఉన్న రెండు లారీలను అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు.

రూటు మార్చిన.. రేషన్ మాఫియా

(5వ పేజీ తరువాయి)

వాడుతోంది. దీంతో గతంలో 25 శాతం నూక ఉంటే ఇప్పుడు 15 శాతం, పాడైన, రంగు మారిన బియ్యం మూడు నుంచి 1.5 శాతానికి పరి మితమయ్యాయి. ఆరోగ్య పరంగా మేలు చేయడానికి మైక్రో న్యూట్రియంట్స్ కలిగిన కెర్నెల్స్‌ని కలుపుతు న్నారు. రేషన్ బియ్యంలో బాగా తెల్లగా కనబడేవి ఇవే. పిల్లలు, మహిళల్లో రక్తహీనతకు చెక్ పెట్టడానికి ఐరన్, నరాలు, మెదడు చురుగ్గా పని చేయడానికి, రక్తం తయారు కావడానికి విటమిన్ బి 12, మహిళల ఆరోగ్యానికి ఫోలిక్ యాసిడ్ వంటి వాటితో కూడినవి ఈ కెర్నెల్స్. వీటిని ప్లాస్టిక్ బియ్యం అనే అపోహలో జనం ఉండిపోయారు. వీటిపై అవగాహన కల్పించడంలో ఆ శాఖలు విఫలమవుతున్నాయి. దీంతో రేషన్ బియ్యం కిలో రూ.20లకు దుకాణం వద్ద విక్రయిం చేస్తున్నారు.



దెందులూరు పీటీఎంలో ప్రతిజ్ఞ చేస్తున్న ఎమ్మెల్యే చింతమనేని, కలెక్టర్ వెట్రి సెల్వి



ఏలూరు కస్తూరిబా పాఠశాలలో బహుమతుల ప్రదానం చేస్తున్న ఎమ్మెల్యే చంటి



రేచర్ల హైస్కూలులో విద్యార్థులు, తల్లిదండ్రులతో ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్



పెదనింద్రకొలనులో విద్యార్థులకు మెమెంటోలు అందిస్తున్న ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు

విద్యతోనే అభివృద్ధి సాధ్యం

▸ జిల్లావ్యాప్తంగా ఘనంగా మెగా పీటీఎంలు

దెందులూరు/పెదపాడు/పెదవేగి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): విద్యతోనే అభివృద్ధి సాధ్యమని, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ నాయక త్వంలో పాఠశాలల బలోపేతానికి ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళు తున్నామని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. శుక్రవారం దెందులూరులోని గారపాటి హైమావతి ఉన్నత పాఠశాలలో జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వితో కలిసి ఆయన పేరెంట్స్ మీటింగ్‌లో పాల్గొన్నారు, ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ హైస్కూల్‌లో చదువుకున్న పూర్వ విద్యార్థులు, దాతలు, గ్రామ పెద్దలు, ప్రముఖుల ద్వారా పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తాన న్నారు. విద్యార్థుల ఉత్తీర్ణత శాతం 97 శాతం దాటి ఉండాలని ఉపాధ్యా యులను కోరారు. అనంతరం కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లా డుతూ విద్యార్థుల కోరిక మేరకు హైస్కూల్లో నూతన మరుగు దొడ్లను మంజూరు చేస్తానన్నారు. పాఠశాలకు తారు రోడ్డు నుంచి తరగతి గదుల వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసు కుంటామని, హైస్కూల్‌లో మిగిలిన ప్రహరీ పనులు ఎమ్మెల్యే చింతమనేని సహకారంతో పూర్తి చేయిస్తామన్నారు. హెచ్ఎం వడ్లపట్ల విజయ్‌కుమార్, సర్పంచ్ యేసమ్మ, టీడీపీ మండల కార్యదర్శి నాగన బోయిన సత్యనారాయణ, కలపాల శ్రీహరి, యిప్పిలి వెంకటేశ్వరరావు, సంపగ తిలక్, కొల్లిపర భాస్కర్, జహీర్ ఉన్నారు. పెదవేగి మండలం కొప్పాకలోని జడ్పీ హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రభాకర్ పాల్గొన్నారు. అక్కడ విద్యార్థుల అవసరాలు, అందుతున్న సౌకర్యాలు, ఆహారం నాణ్యత వంటివి పరిశీలించారు. కొప్పాక, పెదకడిమి గ్రామ సర్పంచ్‌లు పరాశరం భాస్కరదీక్షితులు, కొసరాజు బలరామకృష్ణచౌదరి, విద్యార్థులు పాల్గొన్నారు. పెదవేగి మండలం భోగాపురం హైస్కూల్‌లో మెగా పీటీఎంలో డీడీవో బీవీవీ లక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు.

చింతమనేని పిలుపుకు స్పందించిన టీచర్ అపర్ణాదేవి

దెందులూరు గారపాటి హైమావతి ఉన్నత పాఠశాలలో ఇంగ్లీష్ బోధిస్తున్న టీచర్ అపర్ణాదేవి తనతో పాటు టెన్త్ చదువుకున్న తన స్నేహితులతో కలిసి హైస్కూల్‌లో విద్యార్థుల సౌకర్యార్థం సైకిల్ స్టాండ్ ఏర్పాటుకు రూ.5 లక్షలు అందిస్తామని చింతమనేని పిలుపునకు స్పందించి ప్రకటించారు. టీడీపీ నాయకుడు సత్యనా రాయణపురానికి చెందిన వ్యాపారవేత్త కలపాల చంద్రశేఖర్(బుజ్జీ) రూ.లక్ష 50 వేలతో తాగునీటి వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసినందుకు ఎమ్మెల్యే అభినందించారు. పెదపాడు మండలంలోని పలు పాఠశాలల్లో ఘనంగా మెగా పేరెంట్స్ మీటింగ్‌లు ఎంఈవో సబ్బితి నరసింహమూర్తి ఆధ్వర్యంలో జరిగాయి. క్లస్టర్ ఇన్‌చార్జి గుత్తా అనిల్, సాగునీటి సంఘం అధ్యక్షుడు బొప్పూడి కాశీబాబు, హెచ్‌ఎం. వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

● ఏలూరుటూటౌన్/ఏలూరు క్రైం :విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఎమ్మెల్యే బడేటి చంటి ఆకాంక్షించారు. ఏలూరు కస్తూరిబా బాలికోన్నత పాఠశాలలో జరిగిన మెగా పేరెంట్స్‌డే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బాల్య వివాహాలకు వ్యతిరేకంగా చేపట్టిన వంద రోజుల కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చే యించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మాధవిలత, ఈడా చైర్మన్ పెద్దిబోయిన శివప్రసాద్, ఏఎంసీ చైర్మన్ పార్థసారథి, డిప్యూటీ మేయర్ పప్పు ఉమామహేశ్వరరావు, టీడీపీ నగర అధ్యక్షులు చోడే వెంకటరత్నం, కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు తదితరులు పాల్గొన్నారు. ఏలూరు అమీనాపేటలో ఉన్న సురేష్ చంద్ర బహుగుణ ఇంగ్లీషు మీడియం పోలీసు స్కూల్‌లో పీటీఎం సమావేశం జిల్లా అదనపు ఎస్పీ ఎన్ సూర్యచంద్రరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువులు, సమస్యలపై చర్చించడానికి ఇటువంటి ఆత్మీయ సమావేశాలు దోహదపడతాయన్నారు. అనంతరం ఆటల పోటీల్లో విజేతైన వారికి ప్రశంసాపత్రాలు అందించి అభినందించారు. సీఆర్ఆర్ పబ్లిక్ స్కూలు హెచ్ఎం సాయికుమారి, పాఠశాల హెచ్ఎం స్రవంతి, విద్యార్థులు పాల్గొన్నారు.

● చింతలపూడి/జంగారెడ్డిగూడెం/కామవరపుకోట/లింగపాలెం : విద్యార్థుల చదువు తీరును ప్రతి రోజూ సాయంత్రం తల్లిదండ్రులు పరిశీలించాలని ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ సూచించారు. చింతలపూడి మండలంలోని రేచర్ల హైస్కూలులో జరిగిన మెగా పీటీఎంలో ఆయన పాల్గొని విద్యార్థుల ప్రోగ్రెస్ రిపోర్టు పరిశీలించారు. విద్యార్థులతో ఇంగ్లీషు పాఠాలను చదివించారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఎంఈవోలు జి.రామారావు, కిరణ్‌బాబు, హెచ్ఎం వెంకటరెడ్డి, ఎంపీడీవో కామేశ్వరి, కూటమి నాయకులు పాల్గొన్నారు. జంగారెడ్డిగూడెంలోని ఎస్‌డీఎస్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బొడపాటి వెంకటేశ్వరరావు అధ్యక్షతన మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ (పీటీఎం) ఘనంగా జరిగింది. ఇంటర్ విద్య ప్రాంతీయ సంచాలకుడు, జిల్లా వృత్తి విద్యాధికారి టి.శేఖర్‌బాబు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన నాగలక్ష్మి, జడ్పీటీసీ పోల్నాటి బాబ్జీ తదితరులు పాల్గొన్నారు. స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం. పట్నాల సోమశేఖర్ అధ్యక్షతన పేరెంట్ టీచర్ మీటింగ్ ఘనంగా జరిగింది. కార్యక్రమానికి విచ్చేసిన రాష్ట్ర క్షత్రియ, శెట్టిబలిజ కార్పొరేషన్ల డైరెక్టర్లు నంబూరి రామచంద్రరాజు, చిట్టిబోయిన రామలింగేశ్వ రరావు, టీడీపీ సీనియర్ నాయకులు మండవ లక్ష్మణరావు, పెనుమర్తి రామకుమార్ తదితరు లు మాట్లాడుతూ విద్యార్థులకు, తల్లిదండ్రులకు పలు సూచనలు చేశారు. అనంతరం పిల్లలతో కలిసి భోజనం చేశారు. కామవరపుకోట మండలంలోని పాఠశాలల్లో జరిగిన ఆత్మీయ సదస్సులకు ఎంఈవోలు డి.సుబ్బారావు, ప్రశాం తకుమార్ పాల్గొన్నారు. ఆయా పాఠశాలల హెచ్ఎంలు హాజరయ్యారు. లింగపాలెం మండలంలోని పాఠశాలల్లో లింగపాలెం ఎంపీడీవో కె.వాణి, ఎంఈవో దుర్గారావు ఆధ్వర్యంలో పీటీఎంలు నిర్వహించారు.

● నిడమర్రు/భీమడోలు:నిడమర్రు మండలం పెదనింద్రకొలను, ఉంగుటూరు మండలం నారాయణపురం జూనియర్ కళాశాలలో జరిగిన మెగా పేరెంట్స్ మీట్ సమావేశాలలో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు పాల్గొని విద్యార్థుల తల్లిదండ్రులతో చర్చించారు. పెదనింద్రకొలను ఉన్నతపాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఇటీవల పాఠశాల విద్యార్థి చింతలపల్లి గురుప్రసాద్ మాక్ అసెంబ్లీలో మాట్లాడిన తీరును ప్రశంసించారు. అనంతరం విద్యాశాఖ అందజేసిన హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డులను తల్లిదండ్రులకు అందజేశారు. సర్పంచ్ ముగ్గళ్ల యాకోబు, జడ్పీటీసీ కోడే కాశీ, హెచ్ఎం సత్యేంద్రరెడ్డి, పేరెంట్స్ కమిటీ చైర్మన్ ఎస్.సత్యనారాయణ, కూటమి నాయకులు పాల్గొన్నారు. భీమడోలు మండలంలోని భీమడోలు, గుండుగొలను, పోలసానపల్లి, సూర ప్పగూడెం తదితర గ్రామాల్లో పేరెంట్స్ డే సందర్భంగా విద్యార్థులు, తల్లి దండ్రులు కార్యక్రమాలకు హాజరయ్యారు. పలు పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. పోలసానపల్లి అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల, పలు ఎంపీపీ పాఠశాలల్లో జరిగిన కార్యక్రమాలకు సర్పంచ్ షేక్ హసీనా రహీమా బేగం హాజరయ్యారు.

● పోలవరం/బుట్టాయగూడెం/ కొయ్యలగూడెం/ టి.నరసాపురం/వేలేరుపాడు,, డిసెంబరు5 (ఆంధ్రజ్యోతి): పోలవరం మండలంలోని గూటాల, కొత్తపట్టిసీమ, పోలవరం, కచేరి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ పాఠశాలల్లో జరిగిన మెగా పేరెంట్స్ డే కార్యక్రమాలలో ఏపీ ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు, టీడీపీ మండల అధ్యక్షుడు మంగిన కొండ పాల్గొన్నారు. నల్లా రాంబాబు, పాదం ప్రసాద్, ఏసుగుల శ్రీనివాస్ ఎంఈవోలు సత్యనారాయణ, మూర్తి పాల్గొన్నారు. బుట్టాయగూడెం మండలంలోని అన్ని ఆశ్రమ, జడ్పీ, రెసిడెన్సియల్ పాఠశాలలు, గురుకులాలు, జూనియర్ కళాశాలల్లో పీటీఎం సమావేశాలు జరిగాయి. బుట్టాయగూడెం జడ్పీ జరిగిన కార్యక్రమంలో పూర్వ విద్యార్థి, జనసేన జిల్లా కార్యదర్శి కరాటం సాయిబాబా పాల్గొన్నారు. సర్పంచ్ తెల్లం వెంకాయమ్మ, తహసీల్దార్ వీవీ చలపతిరావు, ప్రిన్సిపాల్ కుసుమ, హెచ్ఎం కె.సుబ్బలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. కొయ్యలగూడెం మండలం కొయ్యలగూడెం ఎంపీపీ మెయిన్ పాఠశాలలో ఉపాధ్యాయులను తల్లిదండ్రులు సత్కరించారు. పాఠశాల చైర్మన్ జిల్లెలమూడి మధుసూదనరావు, హెచ్ఎం పీటర్సన్, ఉపాధ్యాయులు రాయపూడి వెంకట రమణ, తల్లిదండ్రులు, దేవి, వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు. కొయ్యలగూడెంలోని ప్రభుత్వ పాఠశాలలో ఏపీ ఎడ్యుకేషన్ డైరెక్టర్ రమా ఆధ్వర్యంలో మెగా పేరెంట్స్‌డే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాల్లో ఎంపీపీ గంజిమాల రామారావు, ఎంఈవో సురేశ్‌బాబు, ఎంపీడీవో కిరణ్‌కుమార్, ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఆర్‌జేడీ శేఖర్‌బాబు, ప్రిన్సిపాల్ శ్యామ్‌కుమార్, పీఏసీఎస్ అధ్యక్షుడు దుగ్గిన శ్రీను, పట్టణ జనసేన అధ్యక్షుడు మాదేపల్లి శ్రీను, టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు పారేపల్లి నరేశ్, టీడీపీ మండల ఆర్గనైజింగ్ కార్యదర్శి మేఘలాదేవి, బీజేపీ అధ్యక్షుడు కొనిశెట్టి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు. టి.నరసాపురం మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పీటీఎంలు నిర్వహించారు. కార్యక్రమాల్లో తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి తోట లక్ష్మీనారాయణ, జనసేన మండల అధ్యక్షుడు అడపా నాగరాజు, జున్నుబోయిన సోంబాబు, పి.సత్యనారాయణ, ఎ.జగ్గారావు, ఎంపీడీవో జి.మణికుమారి, టి.రామ్మూర్తి, ఎస్. కళ్యాణి, బీఎల్ స్వామి, మోదుగు లక్ష్మణరావు, పరసా శివ, వెంకరామారావు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు. వేలేరుపాడు మండలం వేలేరుపాడు జడ్పీ హైస్కూల్ నిర్వహించిన పీటీఎం సమావేశంలో విద్యార్థుల తల్లిదండ్రులు పెద్దఎత్తున పాల్గొన్నారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీలో నిర్వహించిన మెగా పీటీఎం ఆత్మీయ సమావేశం ఘనంగా నిర్వహించారు.

● ద్వారకాతిరుమల : ద్వారకాతిరుమలలోని ఎంపీయూపీ స్కూల్‌లో జరిగిన మెగా పీటీఎం లో ముఖ్యఅతిథిగా గోపాలపురం నియోజకవర్గ వాణిజ్యవిభాగ అధ్యక్షుడు ఇమ్మడి రత్నాజీ పాల్గొన్నారు. పాఠశాలలో ఉన్న సమస్యలను హెచ్ఎం ఎం.సరళవాణిని అడిగి తెలుసుకు న్నారు. టీడీపీ నేతలు మటపర్తి బద్రి, గువ్వల మావుళ్ల, గోరంట్ల చంద్రశేఖర్, అందుగుల రాములు, జనసేన నేత కోట అంజిబాబు పాల్గొన్నారు.

ఇష్టంతో చదవాలి : కలెక్టర్

దెందులూరు : విద్యార్థులు చిన్నతనం నుంచి ఇష్టపడి విద్యను అభ్యసిస్తే ఉజ్వల భవిష్యత్తు మన సొంతం అవుతుందని కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు.దెందులూరు జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్‌ను శుక్రవారం ఆమె పరిశీలించారు. ప్రతి తరగ తి గదికి వెళ్లి విద్యార్థినులతో మమేకమై వారి విద్యా ప్రగతిని పరిశీలించి ఉపాధ్యా యులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాఠశాలలో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ స్కూల్‌లో పిల్లలతో ఆమె సరదాగా గడిపారు. డీఈవో వెంకట లక్ష్మమ్మ, నియోజకవర్గ ప్రత్యేక అధికారి సత్యనారాయణ, ఐసీడీఎస్ పీడీ శారద తదితరులు పాల్గొన్నారు.



ద్వారకాతిరుమల పీటీఎంలో మాట్లాడుతున్న టీడీపీ వాణిజ్య విభాగ అధ్యక్షుడు రత్నాజి



భోగాపురం హైస్కూల్‌లో మాట్లాడుతున్న డీడీవో లక్ష్మి



జంగారెడ్డిగూడెం పీటీఎంలో మాట్లాడుతున్న టీడీపీ నేత మండవ లక్ష్మణరావు



రంగాపురం జడ్పీ పాఠశాలలో పుస్తకాలు అందజేస్తున్న సర్పంచ్ ముసునూరు రాము



విజేతలైన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందించిన అదనపు ఎస్పీ సూర్యచంద్రరావు



కొయ్యలగూడెం ఎంపీపీ మెయిన్ స్కూల్లో మాట్లాడుతున్న హెచ్ఎం పీటర్సన్



నివాళులర్పిస్తున్న సాహిత్య మండలి ప్రతినిధులు

దేవుడిచ్చిన వరం 'ఘంటసాల'

ఏలూరు రూరల్, డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): తెలుగు జాతికి దేవుడు ఇచ్చిన వరం దివంగత ఘంటశాల వెంకటేశ్వరరావు అని పలువురు వక్తలు కొనియాడారు. దివంగత తెలుగు సినీ నేపథ్య గాయకుడు, సంగీత దర్శకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు 103వ జయంతిని ఘనంగా నిర్వహించారు. స్థానిక రామకృష్ణాపురంలోని సాహిత్య మండలిలో ఉన్న ఘంటశాల విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఘంటశాల స్వరపీఠం వ్యవస్థాపకులు ఎస్‌కే సుభాని, లంక వెంకటేశ్వర్లు, పుల్లబోట్ల పురుషోత్తమరావు మాట్లాడుతూ ఘంటసాల వంటి గాయకులు తెలుగు పాటకు ఎంతో ఖ్యాతి సాధించి పెట్టారని గుర్తుచేశారు. అలనాటి ఘంటసాల పాటలు ప్రేక్షకులను ఆద్యంతం అలరింపజేశాయి.

రక్తదాన శిబిరం

జంగారెడ్డిగూడెం, డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): స్థానిక హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ఆధ్వర్యంలో యోషిత స్వచ్ఛంద సంస్థ సహకారంతో శుక్రవారం బ్యాంకు ఆవరణలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని డాక్టర్ అనిల్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమయానికి రక్తం అందక ఎంతోమంది ప్రాణాలను కోల్పోతున్నారన్నారు. ఆరోగ్యవంతులైన ప్రతీ ఒక్కరూ తమ రక్తాన్ని దానం చేసి మరొకరి ప్రాణం కాపాడాలని సూచించారు. అనేక మంది తమ రక్తాన్ని దానం చేశారు. బ్యాంకు మేనేజర్ బి.సురేష్, దుర్గాప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ఆదివాసీ పాస్టర్ల సెమీ క్రిస్మస్ వేడుకలు



కేక్ కట్ చేస్తున్న చైర్మన్ బొరగం శ్రీనివాసులు

బుట్టాయగూడెం, డిసెంబరు5 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఆదివాసీ పాస్టర్స్ ఐక్యవేదిక, ఏపీ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో బుట్టాయగూడెంలో సెమీ క్రిస్మస్ వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగా యి. ఏపీ ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు వేడుకల్లో పాల్గొని కేక్ కట్‌చేసి అందరికి పంచారు. క్రైస్తవులకు క్రిస్టమస్ శుభాకాంక్షలను తెలియజేశారు. ఐక్యవేదిక ద్వారా పాస్టర్లు తన దృష్టికి తెచ్చిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. తెలుగు రాష్ట్రాలతోపాటు దేశం లోని ఆదివాసీ పాస్టర్ల ఐక్యత కోసం జాతీయ ఆదివాసీ పాస్టర్ల ఐక్యవేదిక పనిచేస్తుందని జాతీయ అధ్యక్షుడు రెవరెండ్ కుర్సం నిరీక్షణరావు తెలిపారు. క్యాండిల్సు వెలిగించి సంబరాలు జరుపుకున్నారు. ఉపాధ్యక్షుడు రెవరెండ్ గుండి పిలిప్, కార్యదర్శి మడివి వెంకటేశ్వర్లు, మడివి కామరాజు, కల్తీ థామస్, కన్నయ్య, కూరం ఏలియా, మడివి కృపానిధి, కొర్స చినరా జులు, స్టీవెన్‌సన్, బెంజిమెన్ రెండు రాష్ట్రాలకు చెందిన ఆదివాసీ పాస్టర్లు పాల్గొన్నారు.

సత్యవోలు హైస్కూలులో స్టడీ మెటీరియల్ పంపిణీ

పెదపాడు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మెగా పేరెంట్-టీచర్స్ మీటింగ్ 3.0లో భాగంగా సత్యవోలు హైస్కూల్‌లో జిల్లా అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ రెడ్డి రామారావు విద్యా ర్థులకు రూ.40 వేలు విలువైన స్టడి మెటిరి యల్‌ను విద్యార్థులకు శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో సమగ్ర శిక్షా జిల్లా సహిత విద్యా సమన్వయకర్త బి.భాస్కరరాజు, గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ నవీనకుమారి, సొంగా నాగేశ్వరరావు, స్టాటికల్ ఆఫీసర్ రామకృష్ణ, లావేటి హేమసుందర్ తదితరులు పాల్గొన్నారు.

సీఆర్ఆర్ పీజీ కాలేజీలో అతిథి ఉపన్యాసం

ఏలూరుఅర్బన్,డిసెంబరు5(ఆంధ్రజ్యోతి):ఔత్సాహిక పారిశ్రా మికవేత్తగా ఎదగడం ఎలా? అనే అంశంపై శుక్రవారం స్థానిక సీఆర్ఆర్ పీజీ కళాశాలలో అతిథి ఉపన్యాస కార్యక్రమం జరిగింది. వ్యాపార ఆలోచనలు, ఆర్థికప్రణాళిక, స్థల సేకరణ, ప్రభుత్వ అనుమతులు, ప్రభుత్వ ప్రోత్సాహకాలు, మార్కెట్‌లో పోటీతత్వం, తదితర అంశాలపై స్థానిక సవిధ డిజిటల్ సంస్థ వ్యవస్థాపకుడు పి.వెంకటేష్ విద్యార్థులకు వివరించారు. మేనేజింగ్ డైరెక్టర్ పి.లలిత, కళాశాల కరస్పాండెంట్ కె.శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ రామరాజు, పీజీ ఇన్‌చార్జి డైరెక్టర్ డాక్టర్ టి.రాజేష్ పాల్గొన్నారు.

ఏలూరు మండల జీఎస్‌డబ్ల్యూఎస్ అధికారిగా విష్ణువర్ధన్

ఏలూరు రూరల్, డిసెంబరు 5, (ఆంధ్రజ్యోతి) : జిల్లా పరిషత్ ఆఫీసులో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న చింతమనేని విష్ణు వర్ధన్ బదిలీపై ఏలూరు రూరల్ మండలం జీఎస్‌డబ్ల్యూఎస్ అధికారిగా శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. మండలంలో సచివాలయాల ద్వారా ప్రభుత్వ పథకాలు అమలు, సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు చేరేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఏలూరు ఎంపీడీవో ఎ.జనార్దన్, డిప్యూటీ ఎంపీడీవో డి.శ్రీనివాసరావు, ఏఈ మురళీకృష్ణ, విజయ్‌కుమార్, ఎం.సాయిరాం, ఎంపీడీవో గారపాటి నాగరాజుకుమారి, మండల పరిపా లనా అధికారి పొన్నూరి సత్యనారాయణ, సీనియర్ అసిస్టెంట్ ఎస్ కాడేమ్మ, శివ, పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

జీలుగుమిల్లి, డిసెంబరు5(ఆంధ్రజ్యోతి) : విద్యుత్ లైన్‌ల మరమ్మతు పనుల్లో భాగంగా మైసన్నగూడెం సబ్ స్టేషన్ పరిధి నుంచి జీలుగుమిల్లి మండలంలో పి.నారాయణపురం, ములగలంపల్లి సబ్ స్టేషన్ వరకు శనివారం కరెంట్ నిలుపుదల చేస్తామని జంగారెడ్డి గూడెం ఈఈ పీర్.అహ్మద్‌ఖాన్ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు స్వర్ణవారి గూడెం, పాములవారిగూడెం, గంగన్నగూడెం, రౌతుగూడెం, కనాకాపురం, దిబ్బగూడెం గ్రా మాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు చెప్పారు.

నేడు పీఏసీఎస్ ఉద్యోగుల నిరసన

ముదినేపల్లి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): తమ డిమాండ్ల పరిష్కారం కోసం ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల ఉద్యోగులు చేపట్టనున్న ఆందోళన కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఏపీపీఏసీఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఏలూరు జిల్లా శాఖ ఉపాధ్యక్షుడు పశ్యం శ్రీనివాసరావు ఒక ప్రకటనలో కోరారు. అన్ని సహకార సంఘాల ఉద్యోగులు శనివారం నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరు కావాలని కోరారు. 8న డీసీసీబీ కార్యాలయాల వద్ద నిర్వహించే ధర్నాతో పాటు దశల వారీ ఆందోళన కార్యక్రమాల్లో ఉద్యోగులంతా పాల్గొనాలన్నారు.


ఆగిరిపల్లి పీటీఎంలో పాల్గొన్న విద్యార్థులు, తల్లిదండ్రులు

పంచాయతీలో నిధుల దుర్వినియోగంపై విచారణ


విచారణ నిర్వహిస్తున్న డీఎల్‌పీవో అమ్మాజీ

ముదినేపల్లి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ముదినేపల్లి మండలం కొర్రగుంటపాలెం గ్రామ పంచాయతీలో 15వ ఆర్థిక సంఘం నిధులు దుర్వినియోగం జరిగినట్లు వచ్చిన ఆరోపణలపై శుక్రవారం ఏలూరు డీఎల్‌పీవో అమ్మాజీ విచారణ నిర్వహించారు. ఆ పంచాయతీ కార్యదర్శి జె గిరిజ 15వ ఆర్థిక సంఘం నిధులు దుర్వినియోగం చేసినట్లు దూబా చంద్రకాంత్ అనే వ్యక్తి కలెక్టర్‌కు చేసిన ఫిర్యాదుపై డీఎల్‌పీవో ఈ విచారణ నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి గిరిజ మండలంలో పనిచేస్తున్న పలు పంచాయతీల్లో తనకు అనుకూలమైన వారిని వెండర్లుగా చూపించి ఆర్థిక సంఘం నిధుల దుర్వినియోగానికి పాల్పడినట్లు విచారణ సందర్భంగా చంద్రకాంత్ డీఎల్‌పీవోకు తెలిపారు. దీనిపై సమగ్రంగా విచారణ నిర్వహించి ఆర్థిక సంఘం నిధుల దుర్వినియోగానికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదిదారు కోరారు. అన్ని అంశాలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని డీఎల్‌పీవో అమ్మాజీ తెలిపారు. డిప్యూటీ ఎంపీడీవో అశోక్ కూడా ఈ విచారణలో పాల్గొన్నారు.

గ్రౌండ్ డ్రైనేజీ సిస్టం ఏర్పాటుకు వితరణ


కళాశాలలో గ్రౌండ్ డ్రైనేజీ స్కీమును ప్రారంభిస్తున్న నరసింహారావు

ముదినేపల్లి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థుల సౌకర్యార్థం ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొడాలి వినోద్ వితరణతో గ్రౌండ్ డ్రైనేజీ సిస్టంను ఏర్పాటు చేశారు. ఈ సిస్టంను శుక్రవారం కైకలూరు నియోజకవర్గ టీడీపీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు ప్రారంభించారు. కళాశాలలో విద్యార్థులకు డ్రైనేజీ సమస్య ఉందని వాష్ ఏరియా అపరిశుభ్రంగా ఉన్న విషయాన్ని తెలుసుకున్న వినోద్ రూ. 25 వేలు వ్యయంతో వాష్ బేసిన్లు, వాటర్ పైపులు ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించారు. వినోద్‌కు ప్రిన్సిపాల్ రఘు, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

సహకార సంఘాల బలోపేతానికి కృషి


రికార్డులు పరిశీలిస్తున్న సత్యవతి

మండవల్లి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): సహకార సంఘాల బలోపేతానికి కృషి చేస్తున్నట్లు డివిజనల్ కోఆపరేటివ్ ఆఫీసర్ కె. సత్యవతి తెలిపారు. మండవల్లి సహకార సంఘాన్ని శుక్రవారం తనిఖీ చేశారు. రైతులకు ఇస్తున్న రుణాలు సంఘాలకు వస్తున్న ఆదాయంపై ఆరా తీశారు. సహకార సంఘాలు రైతులకు మరింత చేరువ చేసేందుకు కృషి చేస్తున్నట్లు వివరించారు. రికార్డులు స్పష్టంగా ఉండేందుకు ఆన్లైన్ చేసినట్లు తెలిపారు. సబ్ డివిజనల్ అధికారి అబ్దుల్ హాది, డివిజనల్ అసిస్టెంట్ కో-ఆపరేటివ్ అధికారిణి పి. విజయకుమారి, బాలభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు పంపు సెట్ వితరణ


మోటారు ప్రారంభిస్తున్న దాత

ముసునూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కాట్రేనిపాడు జడ్పీ పాఠశాలకు గ్రామ ప్రముఖులు, బలివే ఆలయ చైర్మన్ బొమ్మకంటి శ్యామలరావు, ఆయన సోదరుడు లీలాప్రసాద్ రూ. 50 వేల విలువగల పంపుసెట్‌ను శుక్రవారం బహూకరించారు. పంప్‌సెట్‌ను బోరుకు బిగించి శ్యామలరావు ప్రారంభించి మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న ఉచిత సదుపాయాలతోపాటు దాతల ప్రోత్సాహకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. ఉపాధ్యాయులు, స్థానిక నాయకులు శ్యామలరావును సన్మానించారు. సర్పంచ్ గద్దల సుహాసిని మోహన్‌రావు, డీసీ చైర్మన్ బాలకృష్ణ, హెచ్‌ఎం ఎస్.సీతాదేవి పాల్గొన్నారు.

మేలైన యాజమాన్యంతో అధిక దిగుబడులు


రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో

చాట్రాయి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): రబీ మొక్కజొన్న సాగులో మేలైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే నాణ్యమైన అధిక దిగుబడులు సాధించవచ్చునని ఏవో శివశంకర్ అన్నారు. చాట్రాయిలో రబీ మొక్కజొన్న చేలను శుక్రవారం రైతులతో కలిసి పరిశీలించి మాట్లాడుతూ మొక్కజొన్నలో జింక్, పొటాష్, ఇనుము లోపం లేకుండా చూసుకోవాలని, జీరో టిల్లేజ్ విధానంలో సాగు చేసిన మొక్కజొన్నలో కలుపు ఎక్కువ వస్తుందని, దీని నివారణకు హెక్టారుకు 2.5 కేజీలు అట్రాజిన్ 50 శాతం పొడి మందును 500 లీటర్ల లీటరు నీటిలో కలిపి విత్తనం నాటిన 48 గంటల లోపు నేలంతా తడిచే విధంగా పిచికారీ చెయ్యాలన్నారు.




నూజివీడు లేబర్ అసిస్టెంట్ కార్యాలయం వద్ద కార్మికుల నిరసన

లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి : ఐఎఫ్‌టీయూ

నూజివీడు టౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కార్మిక హక్కులు హరించే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, ఐఎఫ్‌టీయూ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి బి. వెంకట్రావు డిమాండ్ చేశారు. శుక్రవారం నూజివీడు అసిస్టెంట్ లేబర్ ఆఫీసు వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ రంగం కార్మిక సంక్షేమ బోర్డును పరిరక్షించాలని, అసంఘటితరంగ కార్మికులకు ఇఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించాలన్నారు. హమాలీ కార్మికులకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని, నిర్మాణరంగ కార్మికులకు ఉచితంగా పనిముట్లు ఇవ్వాలని, నిర్వీర్యం అయిపోయిన సంక్షేమ బోర్డుకు పరిరక్షించాలని, కోరుతూ ఈనెల 15న జిల్లా కలెక్టరేట్ వద్ద జరుగు మహాధర్నాను కార్మికులంతా జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. భవన నిర్మాణ కార్మికులు బి సాయి, శివ సత్యనారాయణరాజు, సింహాద్రి, అర్జున్‌రెడ్డి, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	149, 158, 169
చికెన్ విత్ స్కిన్	284
చికెన్ స్కిన్‌లెస్	294

నెక్ కోడి గుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ.475


వరహాపట్నంలో కామినేని పుస్తకాల పంపిణీ


సి. గుడిపాడు హైస్కూల్‌లో మెగా పీటీఎం



ముసునూరులో మాట్లాడుతున్న ఎంపీడీవో


మండవల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జయమంగళ

విద్యార్థుల బంగారు భవితకే పీటీఎం

మెగా పీటీఎంలో వక్తలు.. కోలాహలంగా విద్యార్థులు, తల్లిదండ్రులతో సమావేశం

చాట్రాయి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పాఠశాలల నిర్వహణలో ప్రజలకు భాగస్వామ్యం కల్పించి పిల్లలకు బంగారు భవిష్యత్తును అందించటమే మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ లక్ష్యమని వక్తలు పేర్కొన్నారు. మండలంలోని 61 ప్రభుత్వ పాఠశాలల్లో శుక్రవారం మెగా పీటీఎం జరిగింది. చాట్రాయి జడ్పీ హైస్కూల్‌లో టెన్త్ ఎస్ఏ పరీక్షలో మొదటి 5 స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు మందపాటి కాంతారెడ్డి, నాగరత్నమ్మ స్మృత్యర్థం వారి మనుమరాలు చల్లా అనితకుమారి పారితోషికాలు అందజేశారు. ఎంపీడీవో రాజు, ఎంఈవోలు ఎం. శ్రీనివాస్, బ్రహ్మాచారి, నాయకులు మోరంపూడి శ్రీనివాసరావు, తల్లాడ శ్రీనివాసరావు, కట్టా నాగ దుర్గారావు, నక్కా రాము, మాదాసు చిన్న పుల్లయ్య, తుమ్మల జగన్, ఆదిమూలం శర్మ, రత్తయ్య, చీకటి శ్రీనివాసరావు, టి. లక్ష్మణరావు పాల్గొన్నారు.

ముసునూరు: విద్యా ప్రమాణాలను మరింత పెంచేందుకు ప్రభుత్వం మెగా పేరెంట్-టీచర్ మీట్‌ను నిర్వహిస్తున్నట్టు గ్రామ టీడీపీ అధ్యక్షులు, పీఏసీయస్ అధ్యక్షుడు ఉప్పలపాటి గణేష్ అన్నారు. శుక్రవారం మండల వ్యాప్తంగా గల పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యంలో మెగా పీటీఎం పండుగలా జరిగింది. విద్యార్థులకు ఆటల పోటీలను గణేష్ ప్రారంభించి విజేతలకు ఆయన ప్రోత్సాహక బహుమతులను అందించారు. ముసునూరు జడ్పీ పాఠశాలలో జరిగిన పీటీఎంలో సర్పంచ్ కొండేటి విజయలక్ష్మి యిర్మీయా, జడ్పీటీసీ డాక్టర్ ప్రతాప్, ఎంపీపీ కొండా దుర్గాభవాని, ఎంపీడీవో పిల్లి ఏసుబాబు పాల్గొని మాట్లాడుతూ తల్లిదండ్రులు ఈ పీటీఎం వల్ల ఉపాధ్యాయుల పనితీరు, విద్యార్థుల విద్యా ప్రమాణాలు ముఖాముఖిగా తెలుసుకుని, విద్యారంగాన్ని అభివృద్ధి పథంలో నడిపేందుకు దోహదపడుతుందన్నారు.

ఆగిరిపల్లి: స్థానిక జడ్పీ హైస్కూల్లో ప్రధానోపాధ్యాయుని పి పుష్పలత ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో సందడి నెలకొంది. తల్లితండ్రులు ఏ విధమైన మార్పులు చేస్తే బాగుంటుందో సలహాలిచ్చారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. మిగతా పాఠశాలల్లోను పీటీఎం జరిగింది. ఎంఈవో-2 కొవ్వలి ఆనంద్‌కుమార్, ఆగిరిపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి జగన్‌మోహన్‌రావు, టీడీపీ నాయకులు చౌటపల్లి విక్టర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఉన్నతికి కృషిచేయాలి: కామినేని

కైకలూరు: విద్యార్థి స్థాయికి తగినట్టుగా బోధించి వారు ఉన్నత స్థితికి వెళ్లేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం కైకలూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల, మండలంలోని వరహాపట్నం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో జరిగిన మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్‌లో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడుతూ విద్యతోనే దేశాభివృద్ధి సాధ్యమని పిల్లల విద్యాభివృద్ధిలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పాత్ర ఎక్కువగా ఉండాలన్నారు. అనంతరం విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు, జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు కెకె బాబు, కూటమి నేతలు వీరాబత్తిన సుధా, కంచర్ల రామకృష్ణ, మంగినేని రామకృష్ణ, ఎంఈఓ డి. రామారావు పాల్గొన్నారు. కైకలూరు ఉర్దూ పాఠశాలల, దాన గూడెం ప్రభుత్వ పాఠశాలలో జరిగిన సమావేశంలో రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ మాల్యాద్రి, యూనిట్ కన్వీనర్ ఎండీ జానీ, పార్టీ పట్టణ అధ్యక్షుడు పడమటి వాసు, జిల్లా తెలుగు యువత కార్యనిర్వహణ కార్యదర్శి చెక్క పూర్ణ తదితరులు పాల్గొన్నారు. కైకలూరు బాలికల జడ్పీ హైస్కూల్లో ప్రముఖ న్యాయవాది గురజాడ ఉదయశంకర్ పాల్గొని పలు సూచనలు చేశారు.

కలిదిండి: పిల్లల చదువుపై తల్లిదండ్రులు దృష్టి సారించాలని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం కలిదిండి జడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై బోయిన బేబమ్మ జ్ఞాపకార్థం ఆమె కుమారులు వితరణగా అందించిన భోజనం ప్లేట్లను విద్యార్థులకు పంపిణీ చేశారు. అనంతరం ఇటీవల తన పుట్టినరోజు సందర్భంగా అభిమానులు బహుమతిగా ఇచ్చిన నోటు పుస్తకాలు, పెన్నులను విద్యార్థులకు కామినేని అందించారు. ఏఎంసీ మాజీ చైర్మన్ వల్లభనేని శ్రీనివాస్ చౌదరి, మాజీ జడ్పీటీసీ నున్నా రమాదేవి, ఎస్ఎంసీ చైర్మన్ తోట గొల్లయ్య, హెచ్‌ఎం స్వర్ణకుమారి తదితరులు పాల్గొన్నారు. ఇంకా పలు గ్రామాల్లోని పాఠశాలల్లో మెగా పీటీఎం జరిగింది.

ప్రతినెలా నిర్వహించాలి: జయమంగళ

మండవల్లి: పేరెంట్స్ మీటింగ్ ప్రతి నెలా నిర్వహించడం వల్ల పిల్లలు ఎలా చదువుతున్నారో, వారి మానసిక స్థితి తల్లిదండ్రులు తెలుసుకోవచ్చని ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ పేర్కొన్నారు. మండవల్లి ప్రభుత్వ కళాశాల, మండవల్లి హైస్కూల్లో శుక్రవారం జరిగిన పీటీఎంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎంపీపీ పెద్దిరెడ్డి శ్రీరామదుర్గప్రసాద్, టీడీపీ నాయకులు ముండ్లపూడి సత్తిబాబు, మండవల్లి సర్పంచ్ ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

ముదినేపల్లి: పీటీఎంలు విద్యాభివృద్ధికి దోహదం చేస్తాయని కైకలూరు నియోజకవర్గ టీడీపీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొడాలి వినోద్ అన్నారు. ముదినేపల్లిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన మెగా పీటీఎంలో వారు ప్రసంగించారు. పెదపాలపర్రు హైస్కూల్లో టీడీపీ మండల అధ్యక్షుడు చల్లగుళ్ళ శోభనాద్రి చౌదరి, రిటైర్డ్ డీవైఈవో గన్నమనేని వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. ముదినేపల్లి జడ్పీ హైస్కూల్లో డీసీ వైస్ చైర్మన్ హనుమార పేర్నీడు, అమరావతి బ్రాండ్ అంబాసిడర్ అంబుల వైష్ణవి, హెచ్‌ఎం విజయకుమార్ పాల్గొన్నారు.

రైతుల పట్ల ఉదారంగా వ్యవహరించాలి

ముదినేపల్లి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): తుఫాను వల్ల నష్టపోయిన రైతుల పట్ల అధికార్లు, రైస్ మిల్లర్లు ఉదారంగా వ్యవహరించాలని ముదినేపల్లి మండల టీడీపీ అధ్యక్షుడు చల్లగుళ్ళ శోభనాద్రి చౌదరి కోరారు. మొంథా, దిత్వా తుఫానుల ఫలితంగా సార్వాకు తీవ్ర నష్టం వాటిల్లిందని, తేమ శాతం నిర్ధారణ విషయంలో రైతులకు నష్టం లేకుండా చూడాలని శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. అధికార్లు, మిల్లర్లు బాధిత రైతాంగానికి సహకరించి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర లభించేలా ప్రయత్నించాలని పేర్కొన్నారు. ధాన్యంలో తేమ శాతం 17 నుంచి 20కి పైగా పెంచేందుకు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి రైతులకు న్యాయం జరిగేలా చూస్తామని శోభనాద్రి చౌదరి తెలిపారు.

లైంగిక దాడులను అరికడదాం

ఆగిరిపల్లి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): పిల్లలపై లైంగిక దాడులు అరికట్టేందుకు సమాజంలో ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని సైకాలజిస్టు వి హిమబిందు అన్నారు. శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్లో పిల్లలపై లైంగిక దాడుల నివారణపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఆందోళన, నిరాశను అధిగమించే పద్ధతులపై విశదీకరించారు. జిల్లా సోషల్ వర్కర్ జి కమల, ఎంఈవో-2 కొవ్వలి ఆనంద్ కుమార్, ఆగిరిపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి జగన్మోహన్‌రావు, స్కూల్ హెచ్‌ఎం పి. పుష్పలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



షష్టి ఉత్సవాల్లో భక్తుల కోలాహలం

ముదినేపల్లి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండలం సింగరాయపాలెం - చేవూరుపాలెం సెంటరులోని శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్టి కల్యాణోత్సవాలు ముగియనుండడంతో శుక్రవారం ఆలయం భక్తులతో కిటకిటలాడింది. దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పుట్టలో పాలు పోసి స్వామిని దర్శించుకున్నారు. మహిళలు పెద్ద సంఖ్యలో నాగ ప్రతిమల వద్ద దీపారాధనలు చేసి పాల పొంగళ్ళు ఉంచి తమ మొక్కులను తీర్చుకున్నారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ రుద్రరాజు గంగా శ్రీదేవి, ఉత్సవ కమిటీ సభ్యులు బొంగు రవికుమార్, పరసా కృష్ణ, నీలం శివరమేష్, కొట్టి సుబ్బలక్ష్మి, భట్టిప్రోలు నాగశిరీష, శాంతి నాగకొండ తదితరులు భక్తులకు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ముదినేపల్లికి చెందిన కట్టా రత్న కుమారి భగవద్గీత పారాయణం, గుడివాడకు చెందిన విజయదుర్గా మహిళ కోలాట బృందం ప్రదర్శించిన మురళీ కోలాటం ప్రేక్షకులను ఆకట్టుకుంది. గురువారం రాత్రి స్వామి వార్ల పుష్పశయ్యాలంకృత పర్యంక సేవ వైభవంగా జరిగింది.

రూటు మార్చిన.. రేషన్ మాఫియా

(5వ పేజీ తరువాయి)

వాడుతోంది. దీంతో గతంలో 25 శాతం నూక ఉంటే ఇప్పుడు 15 శాతం, పాడైన, రంగు మారిన బియ్యం మూడు నుంచి 1.5 శాతానికి పరిమితమయ్యాయి. ఆరోగ్యపరంగా మేలు చేయడానికి మైక్రో న్యూట్రియంట్స్ కలిగిన కెర్నెల్స్‌ని కలుపుతున్నారు. రేషన్ బియ్యంలో బాగా తెల్లగా కనబడేవి ఇవే. పిల్లలు, మహిళల్లో రక్తహీనతకు చెక్ పెట్టడానికి ఐరన్, నరాలు, మెదడు చురుగ్గా పని చేయడానికి, రక్తం తయారు కావడానికి విటమిన్ బి 12, మహిళల ఆరోగ్యానికి ఫోలిక్ యాసిడ్ వంటి వాటితో కూడినవి ఈ కెర్నెల్స్. వీటిని ప్లాస్టిక్ బియ్యం అనే అపోహలో జనం ఉండి పోయారు. వీటిపై అవగాహన కల్పించడంలో ఆ శాఖలు విఫలమవుతున్నాయి. దీంతో రేషన్ బియ్యం కిలో రూ.20లకు దుకాణం వద్ద విక్రయించేస్తున్నారు.

ప్రతి అర్జీకి పరిష్కారం చూపాలి: మంత్రి సారథి


అర్జీలు స్వీకరిస్తున్న మంత్రి సారథి

నూజివీడు టౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను తెలుసుకుని అవసమైతే క్షేత్రస్థాయికి వెళ్ళి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటారని రాష్ట్ర సమాచార పౌర సంబంధాలశాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. నూజివీడు మంత్రి క్యాంప్ కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజా దర్బార్లో ఆయన పాల్గొన్నారు. ఆయన స్వయంగా అర్జీలను స్వీకరించి అధికారులతో చర్చించి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా శుక్రవారం నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో మొత్తం 65 అర్జీలు రాగా సంబంధిత శాఖల అధికారులు పరిష్కారాలు చూపాలని ఆదేశించారు. తాను నియోజకవర్గ పర్యటన చేసే క్రమంలో ఆయా గ్రామాలలో అర్జీ దాఖలు చేసిన వారితో నేరుగా మాట్లాడ తానని సమస్యలు పరిష్కరించకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. నూజివీడు తహసీల్దార్ భద్రు, ఎంపీడీవో రాఘవేంద్రనాథ్, ఆగిరిపల్లి తహసీల్దార్ ప్రసాద్, నూజివీడు మున్సిపల్ కమిషనర్ వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

మంత్రికి సన్మానం

నూజివీడు నియోజకవర్గంలోని 17 మినీ అంగన్‌వాడీ సెంటర్లు, మెయిన్ అంగన్‌వాడీ సెంటర్లుగా ప్రమోట్ కావడంతో అంగన్‌వాడీ టీచర్లు, వర్కర్లు మంత్రి పార్థసారథిని మర్యాద పూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. అంగన్‌వాడీ సిబ్బంది మాట్లాడుతూ ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న మినీ అంగన్‌వాడీ సెంటర్లు మెయిన్ సెంటర్‌లుగా ప్రమోట్ చేయడం సంతోషంగా ఉందన్నారు. తద్వారా సెంటర్లకు టీచర్‌తో పాటు ఒక వర్కరు కూడా వస్తుందన్నారు. అంగన్‌వాడీ వర్కర్లు, టీచర్లు చనిపోతే అంత్యక్రియలకు రూ.15వేలు అందిస్తున్న కూటమి ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

పంచాయతీ వ్యవస్థ బలోపేతం



ఏలూరులోని డీడీవో కార్యాలయం

- ఉమ్మడి పశ్చిమలో ఏడు డీడీవో కార్యాలయాలు ప్రారంభం
- కార్యాలయంలో డీఎల్‌పీవో, డ్వామా ఏపీడీ ఇతర ఆఫీసులు

(ఏలూరు సిటీ-ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి జిల్లాలో పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతం కానుంది. డివిజన్ స్థాయిలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించే శాఖల న్నింటినీ ఒకే పరిపాలన నియంత్రణలోకి తీసు కురావాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. డివిజినల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ (డీడీవో) కార్యాలయాలతో సమన్వయం చేసుకుని అభి వృద్ధి కార్యక్రమాలను సమర్థంగా అమలు చేసేందుకు ప్రణాళికలను రూపొందించింది. గతంలో ఉన్న బ్లాక్ డెవలప్‌మెంట్ అధికారుల తరహాలో ఇప్పుడు డివిజన్ స్థాయిలో డీడీవో వ్యవస్థను తీసుకువచ్చింది. ఎంపీడీవోలకు పదోన్నతులు కల్పించటంతో నియమితులైన డీడీవో డివిజన్ స్థాయిలో అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించనున్నారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పంచాయతీరాజ్‌లో సంస్కరణలు తీసు కురావటంతో డీడీవోలకు విశేష అధికారాలు సంక్రమించాయి. డివిజినల్‌స్థాయిలో ఉన్న డివి జినల్ పంచాయతీ కార్యాలయం (డీఎల్‌పీఓ), డ్వామా అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ (డ్వామా ఏపీడీ) ఇతర శాఖలకు సం బంధించిన డివిజి నల్ కార్యాలయాలను డీడీవో కార్యాలయాల సముదాయంలోకి మార్చాలని ప్రభుత్వం తీసు కున్న నిర్ణయం పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపే తానికి నాంది పలికింది. డీడీవో కార్యాలయాల ఏర్పాటుతో పంచాయతీ పాలన వేగవంతం అవుతుంది. ఇంత వరకు పోలీస్, రెవెన్యూ శాఖ లకు డివిజినల్‌స్థాయిలో కార్యాలయాలు ఉన్నాయి. ఇకపై పంచాయతీరాజ్ వ్యవస్థలో డివిజిన ల్ కార్యాలయాలు ఏర్పాటయ్యాయి. పూర్తిస్థాయి లో ఈ పాలన విస్తరిస్తే గ్రామాలు మరింత అభివృద్ధి చెందటంతోపాటు పాలనా వికేంద్రీక రణ జరిగే అవకాశాలున్నాయి.

ఉమ్మడి జిల్లాలో 7 కార్యాలయాలు

ఉమ్మడి జిల్లాలో ఏలూరు, జంగారెడ్డిగూడెం, నూజివీడు, భీమవరం, నరసాపురం, తాడేపల్లి గూడెం, కొవ్వూరులలో ఏడు డీడీవో కార్యాల యాలు ఏర్పాటయ్యాయి. వీటి ఏర్పాటుకు జడ్పీ నిధులు కేటాయించారు. గురువారం నుంచి తమ కార్యకలాపాలు ప్రారంభించాయి.

పాలనలో నూతన సంస్కరణలు..


పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక(జీపీడీపీ) ల ను డీడీవోలు రూపొందించి అమలు చేస్తాయి. ఆర్థిక వనరులను సమకూర్చుకునేందుకు పంచాయతీలో పన్ను లు, ఫీజుల వసూళ్లపై దృష్టి సారి స్తారు. 16 రకాల అధికారాలను గ్రామ పంచా యతీలపై డీడీవోలు కలిగి ఉంటారు. పంచాయ తీల్లో ఉపాధి పనుల పర్యవేక్షణ, సోషల్ ఆడిట్ సిబ్బందితో గ్రామాల్లో తనిఖీలు నిర్వహించటం తోపాటు స్వయం సహాయక సంఘాల ద్వారా స్వయం ఉపాధి కోసం సహకారం అందిస్తారు.

డీడీవోలకు విధులు..

డీడీవో డివిజన్ స్థాయిలో అన్ని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి విభాగాలపై నియంత్రణ బాధ్యతలు నిర్వహిస్తారు. జిల్లా కలెక్టర్ నియం త్రణలో ఉంటూ డివిజన్ స్థాయిలో ఆయా శాఖల అనుసంధానంతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఇప్పటి వరకు స్థానిక సంస్థల ఎన్నికలకు డిప్యూటీ డిస్ట్రిక్ట్ ఎన్నికల అథారిటీగా ఆర్డీఓలు ఉండేవారు. ఇక నుంచి డీడీవోలకు ఆ బాధ్యతలు అప్పగిస్తూ పంచాయతీరాజ్ రూల్స్‌ను సవరిస్తారు.

పాలన సులభతరం

-కె భీమేశ్వర్, జడ్పీ ఇన్‌చార్జి సీఈఓ



డీడీవో కార్యాలయాలు ఏర్పాటుతో పంచాయతీ ల పాలన సులభమవుతుంది. డివిజన్ స్థాయి మానిట రింగ్ వ్యవస్థ ఏర్పడింది. పంచాయతీల పాలనతో పాటు, మండల పరిషత్‌లో జరిగే కార్యకలాపాలపై డీడీవోల పర్యవేక్షణ ఉంటుంది. పంచాయతీరాజ్ వ్యవ స్థకు డివిజనల్ స్థాయిలో కార్యాలయాలు ఏర్పాటు కావటంతో పంచాయతీ పాలన వేగవంతమ వుతుంది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 7 డీడీవో కార్యాల యాలను జడ్పీ నిధులతో నిర్మించటం జరిగింది. ఈ కార్యాలయాలలో పాలన వేగవంతమైతే పంచాయతీలలో సుస్థిర అభివృద్ధికి సాధ్యమవుతుంది.



50 మందికి ఉచిత దంత చికిత్సలు

చాట్రాయి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): శ్రీభాను స్మైల్ దంత వైద్యశాల నూజివీడు ఆధ్వర్యంలో చాట్రాయిలో శుక్రవారం చాట్రాయిలో నిర్వహించిన ఉచిత దంత వైద్య శిబిరంలో 50 మందికి ఉచిత దంత చికిత్సలు చేసి, మందులు పంపిణీ చేశారు. దంత వైద్య నిపుణుడు డాక్టర్ దినేష్‌బాబు రోగులను పరీక్షించి, దంత సంరక్షణపై అవగాహన కల్పించారు. బూబత్తుల మురళీ, బజ్జూరి అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా 'కీర్తి'



కైకలూరు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా కిసాన్‌మోర్చా అధ్యక్షుడిగా కైకలూరుకు చెందిన కీర్తి వెంకటరాం ప్రసాద్ మూడోసారి నియమితులయ్యారు. శుక్రవారం జిల్లా బీజేపీ అధ్యక్షుడు చౌటుపల్లి విక్రమకిషోర్ చేతుల మీదుగా నియామకపత్రాన్ని అందుకున్నారు. బీజేపీలో సాధారణ కార్యకర్తగా మొదలై అంచెలంచెలుగా జిల్లా కిసాన్‌మోర్చా అధ్యక్షుడిగా మూడోసారి బాధ్యతలు స్వీకరించడం పట్ల పలువురు నాయకులు అభినందనలు తెలిపారు.

ముగిసిన పెదలంక షష్టి ఉత్సవాలు


సందడి చేస్తున్న జబర్దస్త్ టీమ్

కలిదిండి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పెదలంక షష్టి ఉత్సవాల్లో శుక్రవారం చివరి రోజున భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసి స్వామివార్ని దర్శించుకుని పూజలు చేశారు. ఉత్సవాల్లో జబర్దస్త్ టీం చలాకి చంటి, వెంకీ మంకీ పంచ్ డైలాగులతో ఉర్రూతలూగించారు. ఈఓ సింగనపల్లి శ్రీనివాసరావు, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జ్ అక్కల వెంకటాచలం, సర్పంచ్ మొకా లక్ష్మీరామకృష్ణ, ఉత్సవ కమిటీ సభ్యులు వారిని సత్కరించారు.



ప్రాకార మండప నిర్మాణం ప్రారంభం

కలిదిండి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పాతాళ భోగేశ్వర స్వామి ఆలయ ప్రాకార మండప నిర్మాణ పనులను శుక్రవారం ప్రారంభించారు. దేవదాయశాఖ ఉప కార్యనిర్వాహక ఇంజనీర్ శ్రీనివాసరావు, ఆలయాన్ని సందర్శించి పలు సూచనలు చేశారు. ఆలయ ఈఓ సింగనపల్లి శ్రీనివాసరావు, చేపల రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తాడినాడ బాబు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

ముదినేపల్లి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): చేపల చెరువు గట్టుపై గడ్డికోస్తుండగా విద్యుదాఘాతానికి గురై ఓ యువకుడు అక్కడికక్కడే దుర్మరణం పాలైన ఘటన ఇది. పోలీసుల కథనం ప్రకారం అల్లూరి సీతారామరాజు జిల్లా అరకు మండలం మఖివలస గ్రామానికి చెందిన కుర్ల గంగాధరరావు (38) ముదినేపల్లి మండలం కోడూరు గ్రామంలోని ఒక రైతు చేపల చెరువుపై పని చేస్తున్నాడు. ఈ క్రమంలో గురువారం సాయంత్రం గంగాధరరావు చెరువు గట్టుపై పచ్చగడ్డి కోస్తుండగా విద్యుత్ వైర్లకు సంబంధించి ఎర్త్ వైరు అతని చేతిలోని కత్తికి తగిలింది. వెంటనే విద్యుదాఘాతానికి గురై అపస్మారక స్థితికి చేరుకున్నాడు. కొంత సేపటి తరువాత అదే చెరువుపై పని చేస్తున్న సుబ్బారావు అనే వ్యక్తి చూసేసరికే మృతి చెంది ఉన్నా డు. శుక్రవారం అందిన ఫిర్యాదు మేరకు ముదినేపల్లి ఎస్ఐ వీరభద్రరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.